J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 52 02.06.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## ఏ నేతను చూసినా.. ఏమున్నది గర్వకారణం

# ఉచితాలలో మేటి ఒకరికొకరు పోటీ ఎవరికి వారే సాటి



## నేతల ఉచితాల బాట... బాబు నోట కూడా అదే మాట!

**దేశానికి ప్రధానైనా, రాష్ట్రానికి సియమ్మైనా, నియోజకవర్గానికి ఎమ్మెల్యే అయినా అందరిదీ ఉచితాల జపమే. ఓట్ల కోసం ఉచిత పథకాలు అమలు చేయాలనుకోవడం దేశానికి ప్రమాదకరమని మన ప్రధాని మోడీ గతంలో రాష్ట్రాలను హెచ్చరించారు. అలాంటి మోడీ సారథ్యం వహిస్తున్న బీజేపీ కూడా ప్రజాకర్షక ఉచిత పథకాల వైపే మొగ్గు చూపుతోంది. ఇప్పటికే జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఉచితాల పరంపర కొనసాగుతుంటే, ఇటీవల జరిగిన మహానాడులో ప్రతిపక్ష నేత చంద్రబాబు కూడా అదే బాట పట్టనున్నట్లు ప్రకటించారు.**

కీలకమైన విద్య, ఆరోగ్య రంగాల్లో తగినంత పెట్టుబడులు పెట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఆశించిన స్థాయిలో పరిశ్రమల స్థాపన, నిరుద్యోగ నిర్మూలన, మౌలిక వసతుల కల్పన వంటి ప్రజోపయోగ పురోగతిని కూడా సాధించలేకపోతున్నాయి. వీటి నుంచి ప్రజల దృష్టి మళ్లించి, ఓట్లను ఆకర్షించేందుకు పలు రకాల ఉచిత పథకాలను తెరపైకి తెస్తున్నాయి. ఈ హామీల పిచ్చి ఎంతలా ఉందంటే రెండేళ్ల క్రితం తమిళనాడుకు చెందిన ఒక రాజకీయ నాయకుడు 100 రోజుల పాటు చంద్ర మండలానికి, వేసవిలో చల్లని దీవి పర్యటనకు తీసుకు వెళ్తానని ప్రకటించారు. ఈ హామీలు నవ్వులపాలు కావడంతో రాజకీయ నాయకులు చేసే భారీ హామీల గురించి ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఇలాంటి ప్రకటన చేశానని ఆయన వివరణ ఇచ్చుకున్నారు. అయితే, ఆయన ఆ ఎన్నికల్లో ఓడిపోయారు.

### ఉచితాల వరాలతో సాగుతున్న ఆంధ్రా రాజకీయాలు

### వాటిని భరించే సామర్థ్యం రాష్ట్రానికి ఉందా....?

"పిండి కొద్దీ రొట్టె... ఆదాయాన్ని బట్టి ఖర్చులు" అది కుటుంబమైనా, రాష్ట్రమైనా, ఈ విధానం పాటిస్తేనే సంసారమైనా, పరిపాలనైనా సాఫీగా సాగుతుంది. రాష్ట్ర ఖజానాకు గత ఆర్థిక సంవత్సరంలో రూ.1.58 లక్షల కోట్ల ఆదాయం వస్తే రూ.95,000 కోట్ల అప్పు తెచ్చారు. అంటే రాష్ట్ర ఆదాయంలో అప్పులు 70 శాతం ఉన్నాయి. కేంద్రం 2018లో సవరించిన ఎఫ్ఆర్‌బిఎం చట్టం ప్రకారం రాష్ట్ర ఆదాయంలో రాష్ట్రం అప్పులు 20 శాతం మించకూడదు. కానీ, ఇప్పుడు ఆంధ్రా ఆ అప్పుల పరిమితిని దాటి ఇంకో 50 శాతం అదనపు అప్పుల్లో ఉంది. ఇలాంటి దుస్థితిలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పుడు ఖజానాకు ఆదాయం పెంచే మార్గాలు ఆలోచించి బాగుచేసే ప్రయత్నం చేయాల్సిన ఆవశ్యకత చాలా వుంది. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దివాలా అంచున ఉంది. కేంద్రం చేయంది స్తోంది కాబట్టి వెంటిలేటర్‌పై

10లో

## స్వాతంత్ర్య అమృతోత్సవ స్ఫూర్తి..

# భవిష్యత్ భారత నిర్ణాయక దీప్తి

ఇదొక అపూర్వ ఘట్టం. ఆధునిక తరం వీక్షించిన అపురూప ఆవిష్కృతం. భారత ప్రజాస్వామ్య చరిత్ర స్వాతంత్ర్య అమృతోత్సవాలను జరుపుకుంటున్న తరుణంలో దేశ రాజధానిలో అవతరించిన నూతన పార్లమెంట్ భవనాన్ని దేశ ప్రధాని ప్రారంభించడం అరుదైన ఆనంద ఘట్టం. ఇది కేవలం ఓ భవనం మాత్రమే కాదు. ప్రజాస్వామ్య నిర్ణాయక సౌధం. మన సంస్కృతి, సంప్రదాయాలకు, వైభవానికి ప్రతీక. ఇక్కడ నుంచే భారత భవిష్యత్తును శాసించబోయే అనేక నిర్ణయాలు తీసుకోవటం జరుగుతుంది. భవిష్యత్‌లో ప్రజా ప్రతినిధులు ప్రజల గొంతుక




## ప్రజాస్వామ్య పాలనకి సూచిక..

# ఆవిష్కృతమైన అధునాతన వేదిక

వినిపించేందుకు వీలుగా, మారుతున్న కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రపంచ స్థాయి సౌకర్యాలతో, భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్మించిన ఈ సౌధం ప్రధాని మోడీదో, భారతీయ జనతా పార్టీదో కాదు, దేశ ప్రజలది. భవిష్యత్తులో ఏ ప్రభుత్వం వచ్చినా, వారు ఇక్కడ నుంచే నిర్ణయాలు తీసుకోవాలి. భావిభారత భవిష్యత్తు దిశగా నిర్ణయాలు తీసుకునే నూతన పార్ల మెంట్ భవనం మన కళ్ళముందు ఆవిష్కృతమవడం ఈ తరం భారతదేశ పౌరులుగా ప్రతిఒక్కరూ ఆనందించాల్సిన విషయం, గర్వపడాల్సిన తరుణం. ఎందుకంటే ఇది పేదలు

2లో



# బాలూను.. మరచిపోతున్నామా?



గానగంధర్వుడు.. భారతీయ సినిమా గాయకుడు... నెల్లూరు ముద్దుబిడ్డ.. శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) అంటే ఎవరికీ ప్రత్యే కించి పరిచయం చేయాల్సిన పేరు కాదది. బాలూ అంటే చాలు..ఆయన పాటలు-మాటలు అన్నీ మన చెవుల్లో గింగురుమంటాయి. సినీ సంగీత ప్రపంచంలో రారాజుగా వెలుగొందిన సుప్రసిద్ధ సంగీతవేత్త ఆయన. ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానుల్ని, లక్షలాదిమంది ఆత్మీయులు-స్నేహితుల్ని సంపాదించుకుని, సంగీతరంగంలో వేలాదిమంది వర్ధమాన గాయనీగాయకులకు ఉత్సాహప్రోత్సాహాలనందించిన గురువు..బాలు. ఎందరో పుడతారు లోకంలో.. కానీ మహనీయులు కొద్దిమందే ఉంటారు. అలాంటి అరుదైన మహాను భావుల్లో ఎస్పీబీ ఒకరు. దాదాపు అయిదున్నర దశబ్దాలపాటు, పదహారు భారతీయ భాషల్లో, దాదాపు 43వేల పాటలు పాడి సంగీతరంగంలోనే ఒక అనర్ఘరత్నంగా విరాజిల్లిన మహోన్నత గాయకుడు..మన బాలు. తన తీయని పలుకులను, తేనెలూరే మధురమైన పాటలను తరతరాలకూ తరగని ఆస్తిగా మనకు రాసిచ్చి, తను మాత్రం తనువు చాలించి...ఏ దూరతీరాలకో వెళ్ళిపోయారు. తెలుగునేలకు, తెలుగు జాతికే కాక, భరతజాతికే గర్వకారణమైన అంతటి బహుముఖ ప్రజ్ఞాశాలిని కూడా.. కాల గమనంలో పడి మనం మరచిపోతున్నామా?..అనిపిస్తోంది.

జూన్ 4న ఆయన జన్మదినం. బాలు జయంతి అంటే పాటల పూదోటకు వసంతం వచ్చినట్లే. ఆయన ఉన్నప్పుడు ఆ కార్యక్రమాన్ని నెల్లూరులో ఎంతో వైభవంగా చేసేవారు. బాలు నెల్లూరకు వస్తున్నారంటే ఒక పండుగలా ఉండేది. టౌన్‌హాలు కళకళలాడేది. ఆయన చిరునవ్వు, ఆయన మాటలు, పాటలు ప్రతిఒక్కటీ ఒక ప్రత్యేక ఆకర్షణగా అభిమానులను ఉరకలెత్తించేవి. ఆ రోజులన్నీ పోయినట్లేనా?...ఆయన్ని పూర్తిగా మనం మరచిపోతున్నామా?..

దేశవ్యాప్తంగా ఎన్నో విశిష్టమైన అవార్డులు, పద్మశ్రీ..పద్మభూషణ్ వంటి గౌరవ పురస్కారాలు అందుకున్న బాలుకు, దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'భారతరత్న' పురస్కారం కూడా లభిస్తుందని ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా బాలుకు 'భారతరత్న' ఇవ్వాలంటూ ప్రధాని మోడీకి లేఖ కూడా రాశారు. కానీ, అభిమానుల దురదృష్టం..ఆ కల నేటికీ సాకారం కాలేదు.

2020 సెప్టెంబరు 25వ తేది ఆయన ఈ లోకాన్ని వీడి వెళ్లిపోయినప్పుడు, ఆయన జ్ఞాపకాలకు చెరగని గుర్తుగా ఏమేమో చేద్దామని చాలామంది అనుకున్నారు. బాలు పేరుతో ఒక మధురమైన సంగీతవేదికగా ఆడిటోరియం వంటిది నిర్మించాలని, నెల్లూరు టౌన్‌హాలంటే ఆయనకెంతో ఇష్టం కనుక ఆ ప్రాంతంలో ఆయన విగ్రహం పెట్టుకుని ఆయన్ను చూసుకుంటూ ఉండాలని ఎందరో అనుకున్నారు. అవేమీ ఇంకా ఆచరణలోకి రాకపోవడం విచారకరం. ఎంతోమంది దాతలు, ప్రఖ్యాత పారిశ్రామిక వేత్తలు ఎందరో ఉన్నా, నెల్లూరులోని సంగీత పాఠశాలకు బాలు పేరు పెట్టడం తప్ప, ఆ సంగీతబ్రహ్మకు నెల్లూరీయులుగా ఏమీ చేయలేకపోవడం బాధనిపిస్తుంది.

తన తండ్రి శ్రీ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి విగ్రహాన్ని నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రంలో ప్రతిష్ఠించి జన్మనిచ్చిన తండ్రికి శాశ్వతత్వం కల్పించిన తనయుడు..బాలు. మహాభారతాన్ని ఆంధ్రీకరించిన మహాకవి తిక్కనకు కూడా నెల్లూరులో విగ్రహం లేదే..అని బాధపడి, అందుకు కడదాకా ప్రయత్నం చేసిన తెలుగుభాషాభిమాని మన బాలు. తెలుగుభాషకు అపురూపమైన గౌరవం తెచ్చిన మహనీయుడు..13వ శతాబ్దినాటి మహాకవి తిక్కన విగ్రహాన్ని కూడా నేటికీ నెల్లూరులో ప్రతిష్టించుకోలేకపోవడం..ఎవరికి చిన్నతనం?...ఎంత బాధాకరం!...

ఇప్పటికీ ఏ గుడిలో విన్నా, ఎక్కడ పాటలు వినపడినా.. వాటిలో అధికశాతం బాలు పాడిన పాటలే. ఆయన్నెవరూ మరచిపోలేదు. అభిమానులందరూ గుండెల్లోనే గుడికట్టుకుని ఆయన్ను ఆరాధించుకుంటున్నారనడంలో ఎలాంటి అతిశయోక్తి కూడా లేదు. అయితే, ఆ తీయని మనిషికి తీపి గుర్తుగా.. కలకాలం మనందరికీ గుర్తుండే విధంగా.. నెల్లూరులో ఆయనకో స్మారకచిహ్నం ఉంటే బావుంటుందనే... ఇదంతా!.. ఏదేమైనా, బాలు జయంతి రోజున ఒక్క నెల్లూరులోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అనేకమంది సంగీత కళాకారులు ఆయన్ను గుర్తుచేస్తూ, ఆయన పాటలతో అభిమానులను పరవశింపజేస్తున్నారు. అంతకన్నా సంతోషం ఇంకేం కావాలి?.. మన బాలుకు మనమిచ్చే అపురూప గౌరవం ఏదైనా ఉందంటే..అది ఆయన పట్ల మనకున్న అభిమానాన్ని చూపడమే కదా!...ఏమంటారు?...

**(జూన్ 4న బాలు జయంతి సందర్భంగా... బుల్లి బాలుకు పుట్టినరోజు శుభాకాంక్షలు)**

# భవిష్యత్ భారత నిర్ణాయక దీప్తి.. ఆవిష్కృతమైన అధునాతన వేదిక

(మొదటి పేజీ తరువాయి)

మొదలుకుని, కోటీశ్వరుల వరకూ కష్టపడి కట్టిన పన్నుల నుంచి వచ్చిన డబ్బులతో నిర్మించింది. అచ్చంగా ఈ దశాబ్దపు ప్రజల స్వేదం నుంచి పురుడు పోసుకుని, భవిష్యత్తు దిశగా ఠీవీగా నిలబడిన అద్భుత సౌధం.

సమయం, అవసరాలకు అనుగుణంగా పార్లమెంట్‌ను మార్చుకునే ప్రయత్నం చేసిన ప్రభుత్వాన్ని నిజంగా అభినందించి తీరాల్సిందే. దానితో పాటు ఇదే ఆవరణలో ఉన్న పాత పార్లమెంట్ భవనాన్ని పురావస్తు సంపదగా పరిరక్షించాలన్న నిర్ణయం ముదావహం. గత 75 సంవత్సరాల్లో పార్లమెంట్‌లో తయారైన ప్రతి చట్టం, ప్రజాప్రతినిధులు మాట్లాడిన ప్రతి మాట మన ప్రజాస్వామ్య వారసత్వాన్ని తెలియజేస్తాయని చెప్పటంలో ఎలాంటి సందేహం లేదు. బాబూ రాజేంద్ర ప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకుని ద్రౌపది ముర్ము, నరేంద్రమోదీ వరకూ ఓ చరిత్రను పాత పార్లమెంట్ తెలియజేస్తుంది. స్వరాజ్య ఉద్యమంలోనూ, ఆ తర్వాత కూడా మన పాత పార్లమెంట్ భవనం పోషించిన పాత్ర ప్రతి పౌరుడు తెలుసుకోదగినది. ఇక్కడే మన రాజ్యాంగం ఏర్పడింది. భగత్‌సింగ్ బాంబులు విసిరింది ఇక్కడే. సర్ ఎడ్విన్ ల్యుటియన్స్, సర్ హెర్బర్ట్ బేకర్‌లు ఈ భవనానికి వందేళ్ళ క్రితం రూపశిల్పులుగా పని చేశారు. ల్యూటియన్స్ వాస్తుశైలిగా పేర్కొనే ఈ నిర్మాణం మధ్యప్రదేశ్ లోని మితోలి ప్రాంతంలో ఉన్న చౌసత్ యోగిని ఆలయ నిర్మాణాన్ని ఆధారంగా చేసుకుని నిర్మించారని ఆధారాలు కూడా ఉన్నాయి. ఆ విధంగా బ్రిటీషర్లు నిర్మించినప్పటికీ మనదైన సంస్కృతికి నిదర్శనంగా వందేళ్ళకుపైగా చరిత్ర గల పాత పార్లమెంట్ భవనాన్ని గౌరవించుకుంటున్నాం. వందేళ్ళు గడిచినా ఈ భవనాన్నే కొనసాగిస్తూ, అవసరాలకు అనుగుణంగా అదనపు భవనాలను నిర్మించుకుని ముందుకు సాగాం.

శక్తివంతమైన చరిత్రను ఘనంగా చెప్పుకోవటంతో పాటు, వాస్తవికతను అంగీకరించి తీరాలన్నది కాలం చెప్పే సత్యం. కాలానికి అనుగుణంగా వ్యవస్థలు, ప్రక్రియలు నూతనత్వాన్ని సంతరించుకోవాలి. 2017లో ఉపరాష్ట్రపతి హోదాలో, రాజ్యసభ ఛైర్మన్ కుర్చీ నుంచి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేసిన సూచన ప్రజాస్వామ్య చరిత్రలో ఓ నూతన అధ్యాయం. అప్పటి వరకూ సభలో ప్రత్యేక అంశాన్ని లేవనెత్తినప్పుడు, పత్రాలను ప్రవేశపెట్టినప్పుడు 'ఐ బెగ్ టు' అని పలికేవారు. అది బ్రిటీష్ వలసవాద దృష్టికి నిదర్శనమని, దాన్ని విడనాడి స్వాతంత్ర్య భారత ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లే విధంగా 'ఐ రైజ్ టు' అనమని సూచించారు. వారి కాలంలోనే, వారి నుంచే నూతన పార్లమెంట్ భవనానికి ప్రతిపాదన కూడా వెళ్ళింది. 75 ఏళ్ళ భారతదేశ ప్రగతికి ప్రతీకగా నూతన పార్లమెంట్ భవనం నిర్మాణం జరిగింది. సెంట్రల్ విస్టా రీ డెవలప్‌మెంట్‌లో భాగంగా, త్రిభుజాకారంలో ఈ భవనానికి రూపకల్పన చేశారు. ధోల్‌పూర్ మైన్స్‌లో లభించే ఎర్ర ఇసుక రాయితో నూతన పార్లమెంట్ నిర్మాణం జరిగింది. ప్రధాన భవనం పైభాగంలో అశోక చక్రాన్ని పోలిన కాలచక్రాన్ని నిర్మించారు. ఇది 24 గంటలను, 365 రోజులను సూచిస్తుంది. జాతీయ పక్షి నెమలిని ప్రతిబింబించేలా రూపొందించిన లోక్‌సభలో 888 మంది కూర్చోవచ్చు. జాతీయ పుష్పం తామర పూవును ప్రతిబింబించేలా నిర్మించిన రాజ్యసభ భవనంలో 384 మంది కూర్చునే వీలుంది. మర్రిచెట్టును ప్రతిబింబించే విధంగా సెంట్రల్ లాంజ్‌ను తీర్చిదిద్దారు. భారత సాంస్కృతిక వైవిధ్యం, చిత్రకళ, సంప్రదాయాలకు మేళవింపుగా ఈ భవనం అలంకరింపబడింది. భూకంపాలు, ప్రకృతి వైపరీత్యాలు తట్టుకునే విధంగా భారతదేశానికి చెందిన టాటా సంస్థ నిర్మించిన ఈ భవనం భవిష్యత్ అమృత కాలానికి ప్రతీక అని చెప్పటంలో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యంగా పాత పార్లమెంట్ భవనంలో ఎంపీలకు ఆఫీసులు దొరకటం కాస్తంత కష్టంగానే ఉండేది. ఈ భవనంతో ఆ లోటు తీరనుంది. దీనితో పాటుగా సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ నిర్మించిన ఈ భవనం మన సాంకేతిక పురోభివృద్ధిని కూడా ప్రతిబింబిస్తోంది.

## హుందాతనం కోల్పోయిన ప్రతిపక్షాలు..!

భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ చెప్పినట్లు "దేశం అభివృద్ధి చెందటం అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు. పౌరుని నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి". అలాంటి నైతికాభివృద్ధికి ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ప్రశ్నలుగా నిలబడ్డాయి. కొన్ని ప్రతిపక్ష పార్టీలు నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి హాజరు కాకుండా బహిష్కరించటం బాధాకరమైన విషయం. బ్రిటీషర్ల కాలంలో కట్టిన పాత పార్లమెంట్ భవనాన్ని మనదిగా భావించాం. అక్కడ నుంచే నిర్ణయాలు తీసుకుంటూ వచ్చాం. అప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడు మనకు మనంగా నిర్మించుకున్న భవనం విషయంలో రావటం సరైనది కాదు. ప్రారంభోత్సవం నాటి నుంచి కేసులు వేస్తూనే ఉన్నారు. ప్రతి నిర్ణయంలో తప్పులు వెతుకుతూనే ఉన్నారు. రాష్ట్రపతి చేత ప్రారంభోత్సవం చేయించాలని, ఆమె గిరిజనుల కీర్తికి ప్రతీక అని ఇప్పుడు పట్టుబట్టిన ప్రతిపక్షాలకు బీజేపీ తరఫున ఆమె రాష్ట్రపతి అభ్యర్థిగా నిలబడినప్పుడు ఇవన్నీ ఎందుకు గుర్తు రాలేదో అర్థం కాని ప్రశ్న మాత్రమే కాదు.. బహుశా సమాధానం లేని ప్రశ్న కూడా. ఇది దేశ ప్రజలది అనే విషయం అందరూ మరచినట్టున్నారు. ఇంతకు ముందు చెప్పినట్లు ఇది మోదీదో, బీజేపీదో కాదు. ప్రజలది. ప్రజల సొమ్ముతో నిర్మించినది. అందరిది. అలాంటి దాని మీద అలగటం, ప్రారంభోత్సవాన్ని బహిష్కరించటం ప్రస్తుతం ప్రజాస్వామ్య దేశంలో మారిన పరిస్థితులకు నిదర్శనం. హుందాతనానికి దూరమౌతున్న రాజకీయాలకు ప్రతీక.

మాళవికాగ్ని మిత్రమ్ అనే సంస్కృత నాటకంలో కాళిదాసు చెప్పినట్లు...

పురాణ మిత్యేవ న సాధు సర్వం
న చాపి కావ్యం నవ మిత్యవద్యమ్
సన్త పరీక్ష్యాన్యతర ద్భజంతే
మూఢ: పరప్రత్యయనేయబుద్ధి:

పాతదైనంత మాత్రాన ప్రతిదీ మంచిది అనుకోలేము. కొత్తదైనంత మాత్రాన దోషాలతో కూడుకున్నది అనుకోవటం సరైనది కాదు. ఉత్తములైన వారు వాటిని పరీక్షించి, గుణాన్ని బట్టి మంచిదాన్నే తీసుకుంటారు. అవివేకి మాత్రం ఇతరుల మాటల మీద నమ్మకంతో నిర్ణయాన్ని తీసుకుంటాడు.

ఈ స్ఫూర్తి ప్రస్తుత రాజకీయ నాయకుల్లో కొరవడటం దురదృష్టకరమైన విషయం. ఇప్పటికైనా భారత పార్లమెంట్ మన దేశానికి సంబంధించిన భవనం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలి. ఏవైనా పొరపాట్లు ఉండొచ్చు, భవిష్యత్తులో అనుకోని సమస్యలు కూడా ఎదురు కావచ్చు. వాటన్నింటినీ పరిష్కరిస్తూ అభివృద్ధి దిశగా ముందుకు సాగాలే తప్ప, సాకులతో కాలయాపన చేస్తే ప్రజలకే నష్టం అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఎవరు ప్రారంభోత్సవం చేసినా, ఎవరు నిర్మించినా నూతన పార్లమెంట్ సౌధం ఓ చరిత్ర. స్వాతంత్ర్యం సముపార్జించుకుని నూరేళ్ళ మైలురాయికి చేరుకునే సమయానికి, భవిష్యత్తు పాతికేళ్ళకు సాక్షీభూతంగా నిలిచే ఓ అద్భుత సౌధం. పార్లమెంట్ ఉనికికి ఆధారమైన ప్రజాస్వామ్య స్ఫూర్తిని మనం మర్చిపోకూడదు. ఆశావాదంతో, ప్రజలకు జవాబుదారీతనంతో ప్రజాప్రతినిధులు ముందుకు సాగాలన్న విషయాన్ని మన నాయకులు దృష్టిలో ఉంచుకుని, భావిభారత పౌరుల అభివృద్ధికి కట్టుబడి చరిత్రలో గుర్తుండిపోయే విధంగా, వచ్చే పాతికేళ్ళ పాలనను కొనసాగిస్తారని ఆశిద్దాం. భిన్నత్వంలో ఏకత్వానికి, జాతీయ తీర్మానాల సాధనకు, భవిష్యత్ భారత అభివృద్ధికి ఈ భవనం స్ఫూర్తిగా నిలబడి, దీప్తులు వెదజల్లగలదని ఆకాంక్షిద్దాం! ప్రజాస్వామ్య పాలనకి సూచికగా, దేశ బంగారు భవిష్యత్తుని నిర్ణయించే వేదికగా ఈ నూతన పార్లమెంటు భవనాన్ని ఆదరిద్దాం...!

# బిడ్డను కాపాడబోయి.. ప్రాణాలు కోల్పోయిన తల్లులు

నదిలో మునిగిపోతున్న బిడ్డను కాపాడబోయి ఇద్దరు తల్లులు దుర్మరణం చెందారు. నెల్లూరు భగత్‌సింగ్‌కాలనీ, పెన్నానది వద్ద ఆడుకుంటూ తిరుమల-సబిహా దంపతుల కుమారుడు రీహాన్ నీళ్ళలోకి దిగి ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. అది గమనించిన తల్లి సబిహా, ఆమె ఇంటిపక్కనే నివాసం ఉంటున్న స్నేహితురాలు షాహినా ఇద్దరూ నది వద్దకు పరుగెత్తుకు వచ్చి, మునిగిపోతున్న బిడ్డను రక్షించాలనే ఆత్రుతతో నదిలోకి దిగేశారు. బిడ్డను ఒడ్డుకు చేర్చారు కానీ, వారు మాత్రం నదిలో మునిగిపోయి చనిపోయారు. ఈ సంఘటనతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

## పరాజితుడు

చిన్నగీత ప్రక్కన పెద్దగీత గీసినట్లు
నీ నుదిటి గీతను చిన్నది చేసి నిలిపింది విధి
అతగాడు ఆకాశంలోని నక్షత్రాల్ని
పొదవి పట్టుకొని కైవసం చేసుకొంటే
పొలంలో పరిగ ఏరుకొనే విధానం నీదయ్యింది
నీ ఆశల స్వప్నాలు ఆకాశంలోకి
పావురాలకి మల్లే ఎగిరిపోతే
విలవిల్లాడడం నీవంతయ్యింది
నీ మకుటాయమాన అంగీకార సూచికతో
వాళ్ళు దేవేంద్రులై తరలిపోతే
నీవు అప్రకటిత యమర్జెన్సీ
బారినపడి అచేతనమైన కలల బేహారివి
ఇంజనీరింగు వ్యవస్థను
ఎక్స్‌పోర్టు చేస్తున్న ఇన్‌స్ట్రుమెంటువి
అంతర్జాలయుగంలో అంతర్నేత్రం కరువైన శివుడివి
కంప్యూటర్ మేధోమధన సామ్రాజ్యంలో నీవొక సమిధవు.
వాళ్ళ విశిష్ట విత్తాల చరిత్రల
విన్యాస లయల్లో
నీవు పరాజితుడివి... సి.ఎ వి!



చిన్ని నారాయణరావు
94402 02942



# బుచ్చిలో 'వలంటీర్లకు వందనం'

- పాల్గొన్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న

కోవూరు నియోజక వర్గంలోని బుచ్చిరెడ్డి పాళెంలో ఉన్న మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల ఏర్పాటుచేసిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొని వలంటీర్లను ఘనంగా సత్కరించారు. వరసగా మూడో ఏడాది బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని ఉత్తమ గ్రామ వలంటీర్లు, సచివాలయ వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను బహుకరించారు. ప్రసన్న తనయుడు..కోవూరు నియోజక వర్గం యువజన విభాగం కమిటీ అధ్యక్షులు నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్న వలంటీర్ల సేవలను ప్రశంసించారు.

# ఢిల్లీలో మహిళలకు భద్రత ఏదీ?

**- డిసిసి నేత చేవూరు**



భారత రెజ్లర్లను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకోవడం దారుణమని, కొత్త పార్లమెంట్ ప్రారంభోత్సవం రోజున ఈ దారుణం జరగడం న్యాయమేనా అని నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి ప్రశ్నించారు. దేశ రాజధాని ఢిల్లీలో మహిళకు భద్రత లేకపోవడం విచారకరమని ఆయన ఇటీవల ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, భారత మహిళా రెజ్లర్లపై పోలీసుల దాడులు చేసిన ఘటనతో, పార్లమెంట్ నూతన భవనం ప్రారంభోత్సవం నాడు ప్రతిష్ఠించిన చారిత్రాత్మక 'సెంగోల్ (రాజదండం)' తొలిరోజే వంగిపోయినట్లయిందని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. న్యాయం కోసం పోరాడుతున్న రెజ్లర్లకు బీజేపీ ప్రభుత్వం న్యాయం చేయలేదని, బీజేపీ ఎంపీపై మహిళా రెజ్లర్లు లైంగిక ఆరోపణలు చేసి చాలారోజులైనా నేటికి బీజేపీ చర్యలు తీసుకోకపోవడంలో అర్థం ఏమిటన్నారు. భారత మహిళా రెజ్లర్లపై జరిగిన అన్యాయం గురించి ప్రధాని మోదీ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. దేశ ప్రతిష్ఠతను తమ ప్రతిభ నైపుణ్యాలతో కాపాడిన రెజ్లర్లను పోలీసులు దేశ ద్రోహులను ఈడ్చుకెళ్లినట్లు ఈడ్చుకెళ్లి అదుపులోకి తీసుకోవడం అనుచితమన్నారు. రెజ్లర్లపై అన్యాయంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేసి, లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# నటుడు సుమన్‌కి 'రామారావు అవార్డు'

## 'సుప్రీం సెన్సేషనల్ స్టార్' బిరుదు ప్రదానం



నెల్లూరు నగరంలో తరచూ అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో కళా సేవ చేస్తున్న 'సింహపురి సంస్కృతి సమాఖ్య' మే 28వ తేదీన మహానటుడు నందమూరి తారక రామారావు శత జయంతిని నెల్లూరులో జరిపింది. పురమందిరంలో జరిగిన ఈ వేడుకలో ప్రముఖ సినీ నటుడు సుమన్‌ని 'ఎన్టీఆర్ అవార్డు'తో సత్కరించింది. గత 45 సంవత్సరాలుగా 10 భారతీయ భాషల్లో, 750కి పైగా సినిమాలలో నటించి 150కి పైగా చిత్రాలలో హీరో పాత్ర పోషించాడు నటుడు డాక్టర్ సుమన్ తల్వార్. ఈ అవార్డు బహుకరణ సందర్భంగా సుమన్‌కి 'సుప్రీం సెన్సేషనల్ స్టార్' అనే బిరుదును కూడా సంస్థ నిర్వాహకుడు రాంజీ ప్రదానం చేశాడు. ఇంద్రజాలం తన వృత్తియైనా కళామతల్లి సేవని తన ప్రవృత్తిగా మార్చుకుని కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు రాంజీ. మే 28 ఆదివారం నాడు జరిగిన కార్యక్రమంలో కొంతమంది ప్రతిభావంతులను కూడా ఆయన సత్కరించాడు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు జనరల్ మేనేజర్ రాజ్‌కిషోర్, బీజేపీ నేత ఆంజనేయరెడ్డి, పారిశ్రామికవేత్త రమణారెడ్డి, 'లాయర్' పత్రిక సంపాదకులు శివప్రభాత్‌రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

## ఆర్టీసి డెప్యూటి సిటిఎంగా

# ఇబ్రహీమ్

ఆర్టీసీ నెల్లూరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో డెప్యూటి సిటిఎంగా పనిచేస్తున్న ఎం.రవికాంత్‌ను గుంటూరుకు బదిలీ చేశారు. ఆ స్థానంలో చిత్తూరు డెప్యూటి సిటిఎం ఎం.ఇబ్రహీమ్‌ను నియమిస్తూ ఆర్టీసీ ఎం.డి మే 31న ఆదేశాలు జారీచేశారు.

# ఉపాధి కల్పనాధికారి బదిలీ

జిల్లా ఉపాధి కల్పన అధికారి ఏ.సురేష్‌కుమార్‌ను కడపకు బదిలీ చేస్తూ ప్రభుత్వం మే31న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ స్థానంలో ఎవరిని నియమించాలో ఇంకా నిర్ణయించలేదని సమాచారం.

# వ్యక్తిత్వ వికాసంపై.. అవగాహన

నెల్లూరులోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలికల ఐటిఐ కళాశాలలో మే 30న వ్యక్తిత్వ వికాసంపై అధికారులు అవగాహన కలిగించారు. యువజన సంక్షేమశాఖ, సెట్నెల్ అధికారులు సంయుక్తంగా ఈ సదస్సులో పాల్గొన్నారు. జిల్లా కల్పనాధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు రాయడం, చదవడం, మాట్లాడడంలో కూడా ప్రావీణ్యత కలిగివుండాలన్నారు. సెట్నెల్ మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా యువజనసంక్షేమ అధికారి మహేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపల్ పి.నారాయణ, శిక్షణాధికారి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమం.. ప్రభుత్వ లక్ష్యం



వివిధ ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. మే30న నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 18 మంది వికలాంగులకు 18 లక్షల రూపాయల విలువచేసే మోటరైజ్డ్ త్రిచక్ర వాహనాలను జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌తో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వికలాంగుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచి, వారికి దైనందిక జీవితంలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ మోటారు వాహనాలను అందిస్తోందని, ముఖ్యమంత్రిగా వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అక్బర్ అలీ, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఒ సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీతోనే దేశ పురోగతి

ప్రధాని నరేంద్రమోడీ చేపట్టిన అనేకరకాల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతోనే దేశం మంచి పురోగతి సాధిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.రమేష్‌నాయుడు చెప్పారు. మే 31న నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో నాయకులు గుండ్లపల్లి భరత్‌కుమార్, మొగరాల సురేష్, విజయకుమార్, చిలకా ప్రవీణ్, మధు తదితరులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోడీ తొమ్మిదేళ్ళ పాలనలో దేశం అన్ని రంగాల్లో ముందుకు పయనిస్తోందన్నారు. 2014కు ముందు 19వ స్థానంలో ఉన్న వృద్ధి రేటు ఇప్పుడు 7.5 శాతంతో 5వ స్థానంలో ఉండడం దేశ పురోగతికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో నాయకులు అశోక్‌నాయుడు, శ్రీనివాసులు, కందికట్ల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వానము



ప్రవచన సుధాకరులు, వి.ఆర్. కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకులు
కీ॥శే॥ మోపూరు వేణుగోపాలయ్య గారి స్మృత్యంకంగా
**గురువుకి వందనం**
కార్యక్రమము.
తేది : 12.06.2023, సోమవారం ఉదయం 9.30 గంటలకు,
నెల్లూరు శ్రీ కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణంలోని
'రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియం' నందు జరుగును.
ఈ కార్యక్రమంలో...



ముఖ్యఅతిథిగా
భారతదేశ 13వ ఉపరాష్ట్రపతి వర్యులు
**ముప్పవరపు వెంకయ్యనాయుడు** గారు
పాల్గొని, శ్రీ మోపూరు వేణుగోపాలయ్య స్మారక సాహితీ సంచిక
'ప్రవచన సుధాకరుని'
**'వేణు'నాదం**
ఆవిష్కరిస్తారు.
విశిష్ట అతిథులుగా
'పద్మభూషణ్' డాక్టర్ కే.ఐ. వరప్రసాద్‌రెడ్డి గారు
వ్యవస్థాపక ఛైర్మన్ 'శాంతా బయోటెక్నిక్స్'
డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి గారు
సాంకేతిక సలహాదారు 'భారత రక్షణ మంత్రిత్వ శాఖ'
యం.వి.రాయుడు గారు
వ్యవస్థాపకులు, 'మనసు ఫౌండేషన్'
తుంగా శివప్రభాత్‌రెడ్డి గారు
సంపాదకులు, 'లాయర్' వారపత్రిక
పాల్గొంటారు.
: మీ ఆగమనాభిలాషులు :
టి.రమణయ్య, ముఖ్య సమన్వయకర్త
మరియు శ్రీ మోపూరు వేణుగోపాలయ్య ఆత్మీయ బృందం
అందరూ ఆహ్వానితులే..!

లాయర్
జూన్ 02, 2023

# డబ్బులిచ్చి జబ్బుల్ని కొనుక్కుంటున్నామా?

డబ్బులు ఖర్చు పెట్టుకుని వ్యాధుల్ని నయం చేసుకోవడం లోకంలో సహజం. కానీ, డబ్బులిచ్చి జబ్బుల్ని కొనుక్కోవడం అనేది ఎక్కడైనా ఉందా?..అంటే, ఎందుకు లేదూ.. రోజూ చూస్తున్న తంతే కదా అది. 'ఎవర్రా మీలో బడుద్దాయి' అని అయ్యోరడిగితే, అదేదే పెద్ద బిరుదు కాబోలనుకుని, 'నేనే-నేనే' నంటూ బెంచీఎక్కి మరీ చెప్పేడట ఎనకటికి ఓ వెంగళప్ప. అట్లా ఉంది పరిస్థితి. అలాంటి అమాయకశిఖామణులు మనదేశంలో నేటికీ కొల్లలు. ఇక, కూర్చున్న కొమ్మను నరుక్కునే వెర్రిబాగులోళ్ళ సంగతి అసలే చెప్పక్కర్లేదు. కొందరికి అమాయకత్వం, కొండొకచో మూర్ఖత్వం, మరికొందరిలో అజ్ఞానం అన్నీ కలగలసి వెరసి అత్యధికశాతం మంది ప్రజలు జేబుల్లో ఉన్న డబ్బుల్ని గాల్లోకి పొగలా ఊదేస్తున్నారు. సంపాదించుకున్న డబ్బునంతా దుర్వ్యసనాలకు ధారపోసి దుబారా చేస్తున్నారు. డబ్బు పోతే పోయింది కానీ, జబ్బు పోవడం లేదే!..ప్రాణాలు తీసిందాకా వదలని జబ్బులన్నిటినీ మూటగట్టి మన గుండెల్ని, ఊపిరితిత్తుల్నీ ఊపిరిపోయే దాకా పగబట్టి హరించిపారేసే పొగాకును కానీ, దాని ఉత్పత్తుల్ని కానీ జనం కొనకుండా ఉండలేకపోతున్నారు. ఆ మాయదారి ధూమపానం అలవాటయ్యాక, దాన్ని నిలువరించడం ఎవరి తరం కాదు..అన్నట్లుగా తయారైంది పరిస్థితి. ముఖ్యంగా చిన్నవయసులో ఉండేవాళ్ళు, కాలేజీల్లో చదువుకునే విద్యార్థులు, యువత దానికి బాగా అలవాటైతున్నారు.. పొగాకు ఉత్పత్తులకు దాసోహం అంటూ వాటికి బానిసలు కూడా అయిపోతున్నారు.

'నన్ను కాలిస్తే-నిన్ను కాలుస్తా' అని పొగాకు పుర్రె రూపంలో భయపెడుతున్నా, సిగరెట్లో బీడీలో తాగందెవరు?. 'కాకి అరుస్తూనే ఉంటుంది..కరవాడ ఎండుతూనే ఉంటుందన్న' సామెతగా, తాగొద్దని చెప్పేవాళ్ళు చెప్తూనే ఉన్నారు.. తాగేవాళ్ళు తాగుతూనే ఉన్నారు. అటు వ్యాపారులకు డబ్బులు.. ఇటు జనాలకు జబ్బులు. పొగాకు వ్యాపారం వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కంటే, పొగాకు వాడడం వల్ల వచ్చే వ్యాధులను నయం చేసుకోవడానికి దాని వాడకం దారులు ఖర్చుపెట్టే డబ్బే ఎక్కువన్నది అందరికీ తెలిసిందే. ఆ వ్యాధులతో ఎంతోమంది ప్రాణాలు కూడా పోతున్నాయి. అది కూడా అందరికీ తెలిసిందే. ఇకనైనా తెలుసుకోవాల్సిందేమైనా ఉందంటే, ఎవరికి వారు ధూమపానానికి దూరంగా ఉండడమే. ఎవరి ఆరోగ్యం వారు కాపాడుకోవడం ముఖ్యం.

ఒక్క మనదేశంలోనే కాదు సుమా!..ప్రపంచవ్యాప్తంగా ధూమపానం పెరిగిపోతూనే ఉంది. నీలిమేఘాలు కొన్నాళ్ళకి పొగమేఘాలవుతాయేమో! సిగరెట్, బీడీ, చుట్ట తాగడం, పొగాకు నమలడం, ఖైనీ, పాన్‌మసాలా, తంబాకు ఇలా ఏదైతేనేం.. అన్నీ ఆరోగ్యాన్ని నాశనం చేసేవే.

90 శాతం ఊపిరితిత్తుల క్యాన్సర్లకు పొగతాగడమే ప్రధాన కారణం. క్యాన్సర్ కారకాలన్నీ వాటిలోనే ఉన్నాయి. అందువల్ల పొగ తాగడం ప్రాణాలకే ప్రమాదకరం. ఎన్నో వ్యయప్రయాసలకు, అనర్థాలకు, అనారోగ్యాలకు కారణమవుతున్న పొగాకు ఉత్పత్తులను వాడడం ద్వారా ప్రతి 8 నిమిషాలకు ఒకరు ప్రాణాలు కోల్పోతున్నారని, ఏటా 4.9 మిలియన్ల మంది మరణిస్తున్నారని నిపుణుల అంచనా. ఇది 2030 నాటికి ఆ సంఖ్య 10 మిలియన్లకు చేరుకుంటుందని కూడా హెచ్చరిస్తున్నారు. ఈ మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా 'మనకు ఆహారం కావాలి..పొగాకు కాదు' అనే నినాదంతో ప్రపంచ ఆరోగ్యసంస్థ పిలుపునిచ్చింది కూడా. ఆమేరకు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రభుత్వాలకు ఎంతైనా ఉంది.

ఏదేమైనా, ఆరోగ్యానికి తూట్లు పొడుస్తున్న పొగాకు ఉత్పత్తులను ఎంత కష్టసాధ్యమైనా నిరోధించాల్సిందే. ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టడం అవసరం. ముందుగా, పొగాకు పండించే రైతులకు ప్రత్యామ్నాయం చూపించాలి. వారు కూడా పేదరైతులే కనుక. ఆ తర్వాత పొగాకు ఉత్పత్తులను పూర్తిస్థాయిలో నిలిపివేయాలి. అప్పుడే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం. అప్పటిదాకా ఓపిక పట్టాలి. ఈలోగా ఆ ఉత్పత్తులకు ప్రజలే దూరంగా ఉండాలి. ఆ వ్యసనం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో ఇంకా విస్తృతమైన అవగాహన కలిగించాలి. డబ్బులు పెట్టి జబ్బులు కొనుక్కోకుండా చూడాలి. అసలు, కొనేవాళ్లే లేకుంటే పొగాకు కాడ ఎంత పొడుగున్నా ప్రయోజనం ఏముంటుంది?..అందువల్ల, పొగతో ఎవరూ తమ జీవితాలను కాల్చుకోకుండా..ఇతరుల జీవితాలకు పొగపెట్టకుండా జీవనం సాగించాలి. అన్నిటికంటే ముఖ్యంగా...ఎవరి ఆరోగ్యాన్ని వారు జాగ్రత్తగా కాపాడు కోవాలి.




సెంద్రబాబు మహానాడు భలే చేశాడబ్బయ్యా. వానొచ్చి ఇబ్బంది పడ్డారుగాని లేకుంటే జనాలు ఇంకొంచెంసేపు ఓపిగ్గానే ఉండేవోళ్ళేమో. ఏర్పాట్లు బెమ్మాండంగా చేశారు. మాంచి రుచికరమైన పుడ్డు పెట్టారు. పతీసారీ చేసే మహానాడు ఏరే. ఈ మహానాడు ఏరే. ఇది రామారావు వందో పుట్టినరోజు, పైగా రాబోయేది ఎన్నికల ఏడాది. అందుకే దీనికి పత్యేకం. మొత్తానికి ఎన్టీవోడి వందవ పుట్టినరోజు పార్టీకి బానే ఉపయోగపడింది. వచ్చిన అవకాశాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడంలో ఎంతైనా సెంద్రబాబు శానా దిట్ట. మహానాడులో ఏం సెప్తాడా..? మళ్ళీ అధికారంలోకి రావడానికి ఏమేమి వరాలు ఇస్తాడా ..? అని తెలుగుదేశం పార్టీ వోళ్ళకన్నా జగన్ పార్టీ వోళ్ళే ఎక్కువగా ఎదురు చూశారు. వాళ్ళు భయపడినంతగా పెద్దగా వరాలు ఇవ్వలేదు. కానీ... వాళ్ళ పార్టీ నాయకుడి బాటలోనే తానుకూడా నడుస్తానని చెప్పకనే చెప్పాడు. ఇప్పటికే లచ్చలాది కోట్ల రూపాయల పెబుత్వ డబ్బులు పెజల ఖాతాల్లో ఏయడంలో జగన్‌మోహన్‌రెడ్డి ఆరితేరిపోయాడు. రేపు తాను అధికారంలోకి వస్తే అంతకు రెట్టింపు ఇస్తానని చెప్పేసాడు సెంద్రబాబు. యువగళం, అమ్మకి వందనం, ఆడబిడ్డ నిధి, అన్నదాతకి అండ అంటూ ఆయన కూడా అకౌంట్లలో డబ్బులేస్తానని చెప్తున్నాడు. అంతేకాదబ్బయ్యో ... సెంద్రయ్య ఒకడుగు ముందుకేసి ఆడోళ్లకి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఫ్రీగా ఇస్తానంటున్నాడు. ఆడోళ్ళు జిల్లాలో ఎక్కడకు వెళ్లాలన్నా ఒక్క పైసా డబ్బులీయకుండా ఆర్.టీ.సీ బస్సుల్లో వెళ్లొచ్చని అంటున్నాడు.

పెజల్ని సోమరిపోతుల్ని చేసే ఫ్రీ పథకాల వల్ల రాష్ట్రం సంకనాకి పోతుందని సానా మంది సెప్తానే ఉన్నారు. అయినా ఈ నాయకులు మాత్రం మారడంలేదు.

## బాబు కూడా...
# అన్నీ ఫ్రీగా ఇస్తాడంట..!

రాష్ట్రం, పెజలు ఏమైపోతే మాకేంది అన్నట్లుగా పథకాలు పెకటించుకుంటూ పోతున్నారు. మొన్న సెంద్రబాబు పెకటించినాయి కేవలం సాంపిలేనంట, ఎలచ్చన్లు దగ్గరపడే కొద్దీ ఇంకా చానా తాయిలాలు ఆశ చూపిస్తాడని పచ్చ చొక్కోళ్లు సెప్తావుండారు. ఇదేం చూసారయ్యా కొద్ది రోజులు ఆగండి మా పెదబాబు, సినబాబు రాష్ట్రంలో పనిచేసేవోడే లేకుండా సేసేత్తారు అని తెలుగుదేశమోళ్ళు సెప్తున్నారు. ఈళ్ళని ఇలాగే వదిలేస్తే ఇంటింటికి కరంటు ఫ్రీ, మంచినీళ్లు ఫ్రీ, బియ్యం ఫ్రీ, కూరగాయలు ఫ్రీ, గ్యాసు ఫ్రీ, కట్టుకునే గుడ్డలు ఫ్రీ, సబ్బులు ఫ్రీ, షాంపూలు ఫ్రీ, ప్రయాణాలు ఫ్రీ, తాగేవాళ్లకు మందు ఫ్రీ, టీవీలు ఫ్రీ, డిష్ ఫ్రీ, కేబుల్ కనెక్షన్ ఫ్రీ... అని ఇలా తమ నోటికొచ్చినవన్నీ ఫ్రీగా ఇచ్చేస్తామని చెప్పి అధికారంలోకి రావడానికి ప్రయత్నం చేసినా ఆశ్చర్యపోబల్లే.

యాతావాతా తేలోచ్చిందేమిటంటే ఈ రాజకీయ పార్టీలకి, వాటి నాయకులకి రాష్ట్ర సంక్షేమంతో సంబంధం లేదు. సమాజ అభివృద్ధి వారికి అవసరంలేదు. ప్రగతి, పరిశ్రమలతో వారికి పని లేదు. వారికి కావలసిందల్లా అధికారం. వారి అధినాయకుడికి ముఖ్యమంత్రి కుర్చీ, ఆయనకాడుండే నేతలకు అధికార పెత్తనం... ఇదే వారి లక్ష్యం. అనుకున్నది నెరవేర్చుకోవడం కోసం వాళ్ళు ఎంతటి స్థాయికన్నా దిగజారిపోతారు. తమ స్వార్థం కోసం రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రయోజనాలని తాకట్టు పెట్టడానికి సైతం వెనకాడరు. తానొస్తే ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి చేసేదానికి రెట్టింపు చేస్తానని బాబు సెప్తున్నాడు. జగన్ వెండి పళ్లెంలో వడ్డిస్తే, తాను బంగారు పళ్లెంలో వడ్డిస్తానని సెలవిచ్చాడు. అక్రమంగా వచ్చింది దాసి పెట్టుకోవడానికి, పెభుత్వం దగ్గర ఉన్నది పంచిపెట్టడానికే పార్టీలు, వాటి నాయకులు. ఇలాంటి పరిస్థితులలో ఎవరొచ్చినా ఒకటే అన్న విషయం సామాన్యుడికి కూడా అర్థమైపోతావుంది. ఇదబ్బయ్యా మందలా.. ఏ రాయి అయితే నేమి పళ్ళు ఊడకొట్టుకోవడానికి చెప్పు...!

# తోటల రైతాంగాన్ని ఆదుకోండి సారూ!

జిల్లాలో ఇటీవల అకాలవర్షాలకు, మొన్నటి ఈదురుగాలుల దెబ్బకు తోటల రైతులు బాగా దెబ్బతిన్నారు. ముఖ్యంగా మామిడితోటలు, నిమ్మతోటలు బాగా దెబ్బతినడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సీజనొచ్చింది కదా.. ఆదాయాలేమైనా వస్తే అప్పులు తీర్చుకోవచ్చనే ఆశతో ఉన్న మామిడి, నిమ్మ రైతులకు నిరాశే ఎదురైంది. గత ఆదివారం, మొన్న మంగళవారం జోరుగా వీచిన ఈదురుగాలులకు చెట్లమీదున్న మామిడికాయలన్నీ నేలరాలిపోయాయి. ఇక నిమ్మపంట అయితే చేతికి సగం కూడా రావడం లేదు. మెట్ట ప్రాంతాల్లోని అనేక గ్రామాల్లో నిమ్మ పంట వేసివున్నారు. ఈ వేసవికాలంలో మంచి డిమాండ్ ఉంటుందని అనుకుంటున్న తరుణంలో, నిమ్మ పంట చేతికి రాకుండానే పోయింది. ఎక్కువుగా మెట్ట ప్రాంతాల్లో ఉండే నిమ్మ, మామిడి తోటలు, పెన్నానది పరీవాహక ప్రాంతాల్లో ఉండే అరటి తోటలు ఈదురు గాలుల దెబ్బకు చెట్లు విరిగిపడి రైతులు గోడుగోడుమంటున్నారు. ఏ ఏడాదికా ఏడాది ఇలాంటి బాధలు పెరుగుతున్నాయే తప్ప, తరగడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే... ప్రకృతి రైతుల జీవితాలతో ఆటలాడుకుంటోంది. అదునుకు పదునైన వానలు కురిసే రోజులు పోయి, అకాల వర్షాలతో, ప్రకృతి భీభత్సాలతో రైతులు బతుకులు అతలాకుతలమైపోతున్నాయి. ఋతువులు కూడా మారిపోయి ఎండలు మరీ మండిపోతున్నాయి. తోటల్లో చెట్లు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. ప్రభుత్వాలు, అధికారులైనా ఈ కష్ట కాలాల్లో కాపాడకుంటే రైతుల పరిస్థితి మరింత ఘోరంగా తయారవుతుంది. జిల్లా ఉన్నతాధికారులైనా ఈ పరిస్థితులను గమనించి క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేసి, దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకుంటారని విజ్ఞప్తి.

డిఎస్.ఆనందయ్య, పొదలకూరు.




# జీతాలివ్వకుంటే ఎట్లా బతకాలి?

ప్రభుత్వం ప్రభుత్వోద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం ఇంతకాలం ఎంతో హుందాగా బతికిన ప్రభుత్వోద్యోగులకు అవమానకరంగా ఉంది. పేదలు, సామాన్యుల జీవితాలకంటే ప్రభుత్వోద్యోగుల జీవితాలు కష్టతరంగా మారడం ఇప్పుడే చూస్తున్నాం. పిల్లల చదువులు, ఇంట్లో ఖర్చులు వగైరాలకు కూడా డబ్బు లేక కటకట పడాల్సివస్తోంది. ఎప్పటికప్పుడు జీతాలు వస్తాయంటున్నారే తప్ప ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఉద్యోగులను చిన్నచూపు చూడడం సముచితం కాదు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఉండే వారధి ఉద్యోగులే. వారిని దూరం చేసుకోవడం వల్ల సాధించేదేమీ ఉండదు. ప్రభుత్వం ఇప్పటికైనా కనికరించి ఉద్యోగులకు జీతాలు, రావాల్సిన బకాయిలు, ఉపాధ్యాయులకు రావాల్సిన వేతనాలు, బకాయిలు అన్నీ మంజూరుచేయాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ప్రార్థన.

హెచ్ఎస్‌కె బాబురావు, నెల్లూరు.

# కాలనీల్లో కష్టాలకు విముక్తి ఎప్పుడు?

నెల్లూరు నగరం కార్పొరేషన్ స్థాయిలో ఉన్నా, ఇంకా అనేక కాలనీలు సమస్యలకు నిలయాలుగానే ఉంటున్నాయి. కనీస వసతులు లేక ఎంతోకాలంగా ప్రజలు నానారకాల బాధలు పడుతున్నా అధికారులెవరూ పట్టించుకోకపోవడం బాధాకరం. మురుగునీటి పారుదల వసతులు లేక ఎక్కడ మురుగు అక్కడనే వాకిళ్ళముందు మడుగులు కడుతున్నాయి. మురుగు కాలువల్లో పూడికతీత అన్నదే జరగడం లేదు. దీంతో ఎక్కడ చూసినా దోమలు పుట్టలుపుట్టలుగా పెరుగుతున్నాయి. వీటిదెబ్బకు రాత్రుళ్ళు నిద్ర ఉండడం లేదు. నగరంలోని ప్రధానమైన బీవీనగర్, వైఎస్సార్‌నగర్, ఇరుకళలమ్మ సంఘం, పడారుపల్లి తదితర కాలనీలు ఎంతోకాలంగా అభివృద్ధికి ఆమడదూరంలోనే ఉంటున్నాయి. పారిశుద్ధ్య పరిస్థితి అత్యంత ఘోరంగా ఉంది. వేలాది కుటుంబాలు ఈ ప్రాంతాల్లో నివసిస్తున్నా ఎక్కడా పరిశుభ్రత అన్నమాటే కనిపించడం లేదు. నగరపాలక సంస్థ వారు కానీ, జిల్లా అధికారులు కానీ వాటివైపు కన్నెత్తికూడా చూడడం లేదు. 'స్వచ్ఛనెల్లూరు' అంటుంటారే కానీ, వాస్తవానికి ఇది 'మురుగు నెల్లూరు'గానే ఉంటోంది. ఎన్నిసార్లు ప్రజలు విజ్ఞప్తులు చేసుకుంటున్నా స్థానికంగా ఉంటున్న అధికారుల్లోకానీ, సిబ్బందిలో కానీ కాస్తంత కూడా చలనం ఉండడం లేదు. ఎంతకాలం ఈ బాధలు పడాలి. ఈ కష్టాలకు విముక్తి ఎప్పుడో అర్థం కావడం లేదు. కార్పొరేషన్ ఉన్నతాధికారులైనా ఓసారి కాలనీల్లో పర్యటిస్తే, ప్రజలు పడుతున్న బాధలు తెలుస్తాయి.

జి.సి సీతారామయ్య, వైఎస్సార్‌నగర్.

## 11 నుంచి.. నర్రవాడ
# వెంగమాంబాదేవి బ్రహ్మోత్సవాలు

**• పాల్గొననున్న వెంకయ్యనాయుడు**



జిల్లాలోని ప్రసిద్ధమైన పేరంటాలు దేవస్థానం, దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామంలో వెలసివున్న శ్రీ వెంగమాంబాదేవి అమ్మవారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. జూన్ 11న ఆదివారం రోజున నిలుపు, పసుపుదంచే కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అదేరోజు భారత 13వ ఉపరాష్ట్రపతి, మన నెల్లూరీయులు ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 12, 13 తేదీల్లో అమ్మవారిని రథంపై వేంచేపు చేసి ఊరేగింపు నిర్వహిస్తారు. 14న కల్యాణోత్సవం, పసుపు కుంకుమ ఉత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించనున్నారు. 15వ తేది ఉత్సవాల ముగింపు రోజున అమ్మవారికి పొంగళ్ళు నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ బ్రహ్మోత్సవాలకు జిల్లావ్యాప్తంగానే కాక, ఇతర రాష్ట్రాల నుంచి సైతం వేలసంఖ్యలో భక్తజనం తరలివస్తారు కనుక, భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.




## చెన్నై 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో..
# ఎన్టీఆర్ శతజయంతి



చెన్నైలోని 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో మే 28న ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. టీనగర్‌లోని ఆంధ్రక్లబ్ కృష్ణాహాల్‌లో జరిగిన ఈ వేడుకల్లో వక్తలు మాట్లాడుతూ, మహానటుడు ఎన్టీఆర్ ఏ పాత్రలో నటించినా, అది నటన అని కాక ఆ పాత్రలో జీవించినట్లే ఉంటుందని, నాయక పాత్రల్లోనే కాక ప్రతినాయకుడిగా నటించినా అది అద్భుతమేనని కొనియాడారు. సాంఘిక, పౌరాణిక, జానపద, చారిత్రిక చిత్రాల్లో ఆయన నటనకు ప్రేక్షకులు ముగ్ధులైపోయేవారని ప్రశంసించారు. వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి మాట్లాడుతూ 1948లో చిత్రసీమలో అడుగుపెట్టిన ఎన్టీఆర్ దాదాపు 300కు పైగా చిత్రాల్లో తన అద్భుత నటనాచాతుర్యంతో తెలుగుప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ పౌరాణిక చిత్రాల్లోని కొన్ని పద్యాలను ఆయన శ్రావ్యంగా గానం చేసి సభికులను అలరించారు. ఎన్టీఆర్ సినీజీవితం అధికభాగం చెన్నైలోనే కొనసాగిందని, ప్రత్యేకించి టీనగర్‌తో ఎన్టీఆర్‌కున్న అనుబంధం మరపురానిదని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు అన్నారు. వేద విజ్ఞాన వేదిక సంస్థ తరఫున ఎన్టీఆర్ శతజయంతి కార్యక్రమాలు నిర్వహిస్తుండడం తమకెంతో ఆనందాన్నిస్తోందన్నారు. తొలుత, జేకేరెడ్డిని, ఆయన పాడిన పద్యాలకు కీబోర్డు వాద్యసహకారం అందించిన రమేష్‌ను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న రాజధాని కళాశాల తెలుగు శాఖాధ్యక్షురాలు డాక్టర్ ఆంబ్రూనిని జేకెరెడ్డి, కందనూరు మధు, ఏఐటీఎఫ్ అధ్యక్షుడు ఆచార్య సిఎంకె రెడ్డిలు శాలువాతో సత్కరించారు. ఆలిండియా రేడియో రిటైర్డ్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఆస్కా కమిటీ సభ్యులు రంగారెడ్డి, కేకే చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నెల్లూరులోని వెంకటేశ్వర పురంలో ఉన్న నగరపాలక ఉన్నత పాఠశాలలో 1995-96 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు మే 29న మైపాడుగేట్ సెంటర్‌లోని కెపిఆర్ కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పాఠశాలలో చదివిన రోజులను, నాటి స్నేహాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందించారు. ఉత్సాహంగా డ్యాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నాటి ప్రధానోపాధ్యాయుడు, అభినవ ఘంటసాల బిరుదాంకితుడు పాటూరు శ్రీనివాసులును, ఉపాధ్యాయులు పి.శ్రీనివాసులు, భరత్‌కృష్ణారెడ్డి తదితరులను సత్కరించారు.

# మరో విజయం

**• జిఎస్ఎల్‌వి-ఎఫ్ 12 సక్సెస్ • షార్‌లో సంబరాలు**



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ఘనవిజయాన్ని సాధించింది. దేశీయ నావిగేషన్ వ్యవస్థను బలోపేతం చేసే కృషిలో భాగంగా, రెండోతరం నావిక్ ఉపగ్రహశ్రేణిలో మొదటిసారిగా శ్రీహరికోటలోని షార్‌లో ఉన్న రెండో ప్రయోగ వేదికపై నుంచి ప్రయోగించిన జిఎస్ఎల్‌వి-ఎఫ్ 12 రాకెట్ నింగిలోకి దూసుకుపోయి, అంతరిక్షంలో నిర్దేశిత కక్ష్యకు చేరింది. 51 మీటర్ల పొడవు, 420 టన్నుల బరువున్న ఈ జిఎస్ఎల్‌వి రాకెట్ మే 29న ఉదయం 10.42 గంటలకు ప్రయోగించిన ఈ రాకెట్ కేవలం 19 నిమిషాల వ్యవధిలోనే 2,232 కేజీల బరువుగల ఎన్‌విఎస్-01 ఉపగ్రహాన్ని అంతరిక్షంలో విజయవంతంగా విడిచిపెట్టింది. దీంతో షార్‌లో సంబరాలు మిన్నుముట్టాయి. ఇస్రో అధినేత డా.కె.సోమనాథ్ పర్యవేక్షణలో శాస్త్రవేత్తలు అహరహం శ్రమించి ఈ రాకెట్ ప్రయోగాన్ని జయప్రదం చేయడంతో భారత్ మరో ప్రతిష్ఠాత్మక విజయాన్ని సాధించినట్లయింది. అమెరికా, రష్యా వంటి అగ్రదేశాలకు దీటుగా భారత్ సొంత నావిగేషన్ వ్యవస్థను సుస్థిరం చేసుకుంటోంది. ఇప్పటికే 8 ఉపగ్రహాలను నింగిలోకి పంపింది. వీటిలో నాలుగు ఉపగ్రహాలకు కాలం చెల్లిపోవడంతో, వాటి స్థానాన్ని భర్తీ చేయడం కోసం ఎన్‌విఎస్-01 ఉపగ్రహం ద్వారా పంపారు. దీనిద్వారా నావిగేషన్ వ్యవస్థల పరిరక్షణతో పాటు, భూమిమీద, సముద్రమార్గాల్లోనూ దారిచూపడానికి, సముద్రంలో మత్స్య సంపదను గుర్తించడానికి, వైమానిక ప్రయోజనాల కోసం కూడా ఈ ఉపగ్రహం ఎంతగానో ఉపయోగపడేవిధంగా భారత శాస్త్రవేత్తలు దీనిని రూపొందించడం విశేషం. 12 ఏళ్ళ పాటు పనిచేసేలా ఈ ఉపగ్రహాన్ని రూపొందించారు.

## త్వరలో మరో 4 ఉపగ్రహాలు

**డా.సోమనాథ్**

జిఎస్ఎల్‌వి ఎఫ్-12 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడానికి కృషిచేసిన శాస్త్రవేత్తలందరికీ ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ అభినందనలు తెలిపారు. దేశీయ నావిగేషన్ కోసం త్వరలోనే మరో నాలుగు ఉపగ్రహాలను ప్రయోగించనున్నామని, ప్రత్యేకించి వాతావరణ పరిశోధన కోసం ఒక ప్రయోగాన్ని చేపట్టనున్నామని చెప్పారు. ఇదే స్ఫూర్తితో త్వరలోనే చంద్రయాన్-3 ప్రయోగానికి కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయని, చంద్రయాన్‌లో మానవరహిత ప్రయోగానికి ఇస్రో సిద్ధమవుతోందని ఆయన తెలిపారు.

## విద్యాకానుక కిట్‌లు
# వచ్చేశాయ్

పాఠశాలల విద్యార్థులు ఎదురుచూస్తున్న జగనన్న విద్యాకానుక కిట్‌లు వచ్చేశాయి. జిల్లాలోని 37 మండలాల్లో స్టాక్‌పాయింట్లలో వీటిని భద్రపరిచారు. వీటిని జిల్లాలోని 2039 ప్రాథమిక పాఠశాలలకు, 245 ప్రాథమికోన్నత, 340 ఉన్నత పాఠశాలల్లోని మొత్తం 1,92,900 మంది విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ ఉషారాణి ఇటీవల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటిదాకా జిల్లాకు 1,92,743 బ్యాగ్‌లు, 10,66,532 రాతపుస్తకాలు, 1,92,743 యూనిఫాం దుస్తులు, 1,38,604 బెల్టులు, 1,91,731 బూట్లు, 22,360 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, మరో 16,533 పిక్టోరియల్ డిక్షనరీలు వచ్చాయని, ఇంకా కొన్ని రావాల్సి ఉందని తెలిపారు. పాఠశాలల ప్రారంభం రోజున వీటిని విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు.

## అత్యవసర సేవలపై
# అవగాహన

అత్యవసర సమయాల్లో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలనే అంశాలపై మే 28న నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. 'వరల్డ్ ఎమర్జెన్సీ డే'ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో నగర ట్రాఫిక్ డిఎస్పీ అబ్దుల్ సుభాన్ పాల్గొని మాట్లాడారు. అత్యవసర సమయాల్లో వెంటనే స్పందించడం వల్ల, ట్రామా కేర్ ద్వారా బాధితుల ప్రాణాలు కాపాడవచ్చని ఆయన సూచించారు. ఆసుపత్రి ఎమర్జెన్సీ విభాగాధిపతి కృష్ణచైతన్య, వైద్యులు బిందుశ్వేత, సాహిత్యారెడ్డి, కిరణ్, వైస్ ప్రెసిడెంట్ మహేశ్వర్‌రెడ్డి, గణేష్ నాగిరెడ్డి, ఉదయ్ భాస్కర్, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జగన్ సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

**- మెట్టుకూరు ధనుంజయరెడ్డి**



రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని, ఆ పథకాలకు ప్రజల నుంచి విశేషాదరణ లభిస్తోందని ఉదయగిరి నియోజకవర్గ వైకాపా పరిశీలకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి అన్నారు. మే 29న మెట్టుకూరు ధనుంజయరెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డిల సారథ్యంలో, ఉదయగిరిలో భారీస్థాయిలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో ధనుంజయరెడ్డి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ఉదయగిరిలో పోటీచేసేందుకు టిక్కెట్ ఎవరికిచ్చినా తామంతా కలిసికట్టుగా విజయానికి కృషిచేస్తామని, జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చూడాలన్నదే తమ ఆకాంక్ష అని అన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజల అభివృద్ధి ధ్యేయంగా కృషిచేసే పార్టీ ఒక్క వైకాపాయేనన్నారు. అన్నివర్గాల వారికి తమ పార్టీలో సముచిత స్థానం లభిస్తోందని, వైకాపాను తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. పేదలంటే జగన్‌కు ప్రాణమని, వారి కలలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి నిరంతరం ఎన్నో పథకాలు అమలుచేస్తున్నారని ఈ ర్యాలీలో పాల్గొన్న మెట్టుకూరు చిరంజీవిరెడ్డి అన్నారు. తనకు ప్రాణం ఉన్నంతవరకు తాను జగన్ వెంటే ఉంటానని ఆయన అన్నారు. ఈ బైక్‌ర్యాలీలో సుమారు 1500 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు బైక్‌లతో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. కలిగిరి నుంచి ఉదయగిరి వరకు సుమారు 50 కిలోమీటర్లు ర్యాలీ కొనసాగింది. 'జగనన్నా జయహో' అంటూ కార్యకర్తలు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు.

# జూన్ 4న..ఎస్పీ బాలు జయంతి వేడుకలు

గానగంధర్వుడు, ప్రఖ్యాత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా జూన్ 4న 'చేతన' సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నట్లు వేదిక కార్యదర్శి వై.శేషగిరీశం తెలిపారు. నెల్లూరు టౌన్‌హాలులో ఆరోజు సాయంత్రం 6.30 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఈ సందర్భంగా విజయనగరం సంగీత నృత్యకళాశాల విశ్రాంత సంగీత అధ్యాపకులు బి.ఏ నారాయణకు 'సుస్వర సంగీత విశారద' అనే బిరుదుతో ఎస్పీ బాలు అవార్డును బహుకరిస్తామన్నారు. పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ ఈ సభకు అధ్యక్షత వహిస్తారని, సభను విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డా. యం.సుబ్రహ్మణ్యం నిర్వహిస్తారని, కొండూరు హరినారాయణరెడ్డి, జేకే రెడ్డి (చెన్నై)లతో పాటు, వీరిశెట్టి హజరత్‌బాబు, వాకాట విజయకుమార్‌రెడ్డి, సినీ రచయిత డా.పి. రాజేంద్రకుమార్, కొల్లూరు శ్రీనివాసరావు, ప్రొఫె. జివిన్ ప్రసాద్‌రెడ్డి, నలుబోలు బలరామయ్య నాయుడు, వై.వెంకటరామయ్య తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా సా.6.30 గంటల నుండి సినీసంగీత విభావరి ఉంటుందని పేర్కొన్నారు.

## ఆదాల చేతులమీదుగా..

# వలంటీర్లకి 'సేవా వందనం'



నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డిల సూచనలతో ఇటీవల 20వ డివిజన్ నాయకులు, శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్), నెల్లూరు నగర ఎస్‌సి సెల్ డివిజన్ సీనియర్ నాయకులు తాళ్లూరి సురేష్‌బాబు సమిష్టి ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరు కొండాయపాళెం 20వ డివిజన్ అన్ని సచివాలయాల వలంటీర్లకి సేవా వందనం పురస్కారాలను ప్రదానం చేశారు. వలంటీర్లను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రజలకు అందిస్తున్న వలంటీర్ల సేవలు ఎంతో విశిష్టమైనవని కొనియాడారు. వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాలన్నారు. అత్యుత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలను ప్రదానం చేశారు. విజయ డైరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, స్వర్ణా వెంకయ్య,హరిబాబు యాదవ్, జడ్పీటీసి సుధాకర్‌రెడ్డి, మొయిళ్ళ గౌరీ, సురేష్‌రెడ్డి, నూనె మల్లికార్జున్ యాదవ్, చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, రావూరు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాతృభాషలోనే పరిపాలన నిర్వహించాలి

**- సాముల రమేష్‌బాబు**




పరిపాలన మాతృభాషలోనే నిర్వహించాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవా ధ్యక్షుడు సాముల రమేష్‌బాబు అన్నారు. ఇటీవల నెల్లూరు టౌన్‌హాల్‌లోని ఏసీ హాల్లో జరిగిన ప్రజా చైతన్యసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1966 మే 14న తెలుగుభాషను అధికార భాషగా, పాలనాభాషగా ప్రకటిస్తూ చట్టం చేశారని, అయితే అది ఇంతవరకు అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. పార్లమెంటులో తెలుగులో మాట్లాడే హక్కు ఉందని, కేంద్రంతో కూడా ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో చేయవచ్చని ఆయన అన్నారు. తెలుగు ప్రాంతీయ భాష కాదని, జాతీయభాష అని ఆయన పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పరిపాలన తెలుగులోనే జరగాలని ఆయన కోరారు. సమాఖ్య కార్యదర్శి డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు తెలుగు భాషలోనే కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. న్యాయస్థానాల్లో కూడా తీర్పులు ప్రజాభాషలోనే రావాలన్నారు. భాష ఆత్మగౌరవానికి చిహ్నమన్నారు. మాతృభాష అన్ని రంగాల్లో అమలయ్యేందుకు ఒక సంవత్సరం పాటు తమ సమాఖ్య కార్యక్రమాలు రూపొందించిందని, యువత విద్యార్థులు భాషపై మక్కువ పెంచుకొని మాతృభాషలోనే విద్యను కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి చల్లంచర్ల భాస్కర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. పద్య కళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయప్రకాష్, డాక్టర్ పాతూరి అన్నపూర్ణ పాల్గొన్నారు.






# నెల్లూరు కబుర్లు

## నగరంలో వాన భీభత్సం

భగ్గుమంటున్న ఎండల్లో మండిపోతున్న నగర ప్రజలకు చల్లని వాన ఆహ్లాదాన్ని కలిగించింది. అయితే, ఆ వాన కొద్దిసేపట్లోనే భీభత్సం సృష్టించడంతో ప్రజలు సమస్యలకు గురయ్యారు. మే 30వ తేది మంగళవారం మధ్యాహ్నం ఉన్నట్లుండి వాతావరణం మారిపోయింది. ఆకాశంలో నీలిమబ్బులు కనిపించాయి. అంతలోనే జోరు వాన కురిసింది. ఉరుములు మెరుపులతో, ఈదురు గాలులతో వాన కొద్దిసేపు భీభత్సం సృష్టించింది. నగరంలో పలుచోట్ల విద్యుత్‌తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. నగరంలో రోడ్లు మురుగు కాలువలను తలపించాయి. మోకాటిలోతు నీళ్ళతో రోడ్ల మీద నడవడం పాదచారులకు గగనమైపోయింది. ఏదేమైనా గత కొద్దిరోజులుగా భానుడి ప్రతాపానికి ఈసురోమంటున్న ప్రజలకు వరుణుడి చల్లని కరుణతో ఉపశమనం కలిగింది.

## 9 మంది ఎస్ఐలకు బదిలీలు

జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న తొమ్మిది మంది ఎస్ఐలను బదిలీచేస్తూ మే 29న జిల్లా ఎస్పీ డా.కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాలిచ్చారు. షేక్ సుభానీని సిసిఎస్ నుంచి నెల్లూరు రూరల్‌కు, సిహెచ్ కోటిరెడ్డిని నెల్లూరు రూరల్ నుంచి వింజమూరుకు, వై.రంగనాథ్ గౌడ్‌ను వింజమూరు నుంచి రాపూరుకు, ఎన్ క్రాంతి కుమార్‌ను రాపూరు నుంచి డిసిఆర్‌బికి, ఏ.బాజిరెడ్డిని దుత్తలూరు నుంచి ఉలవపాడుకు, టి.త్యాగరాజును ఉలవపాడు నుంచి నెల్లూరు విఆర్‌కు, ప్రభాకర్‌ను ఉదయగిరి నుంచి దుత్తలూరుకు, కె.ఇంద్రసేనారెడ్డిని తోటపల్లిగూడూరు నుంచి ఉదయగిరికి, జె.కుమార్‌ను సౌత్ ట్రాఫిక్ స్టేషన్ నుంచి తోటపల్లిగూడూరుకు బదిలీ చేశారు. వీరంతా వెంటనే విధుల్లో చేరాలని ఎస్పీ ఆదేశించారు.

## జక్కా వెంకయ్యకు నివాళి

ప్రముఖ సిపిఎం నాయకుడు జక్కా వెంకయ్య అయిదవ వర్ధంతిని పురస్కరించుకుని మే 29న ఆ పార్టీ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ప్రజలకు, పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 47, 48 డివిజన్‌లలో మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. 16వ డివిజన్‌లో జక్కా వెంకయ్య కుటుంబసభ్యులతో కలిసి పార్టీ నాయకులు ప్రజలకు పుచ్చకాయలు పంపిణీ చేశారు. సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు చంద్రయ్య, కె.శ్రీనివాసులు, కొండయ్య, చిన్నయ్య, రామారావు, సుబ్బరాయుడు, మల్లి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## యానాదులకు ప్రాతినిధ్యం కల్పించాలి



యానాదులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలంటూ యానాదుల పొలిటికల్ ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ కేసీ పెంచలయ్య డిమాండ్ చేశారు. మే 28న నెల్లూరులోని డా.జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో జరిగిన యానాదుల రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. యానాదులకు ఎస్టీ కమిషన్ ఛైర్మెన్ పదవిని కేటాయించాలన్నారు. యానాదులకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా ఆగస్టులో లక్షమందితో విజయవాడలో 'యానాది గర్జన' కార్యక్రమం నిర్వహించబోతున్నామని చెప్పారు. మేయర్ స్రవంతి, యందేటి వెంకట సుబ్బయ్య, చేవూరు సుబ్బారావు, బివిల్ శేఖర్, బషీర్, యల్లంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# శేషజీవితం హాయిగా గడపండి

**- జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి**

ఉద్యోగ విరమణ పొందిన పోలీసు సిబ్బంది తమ శేషజీవితాన్ని హాయిగా గడపాలని జిల్లా ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆకాంక్షించారు. మే 29న నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఉద్యోగవిరమణ పొందిన హోంగార్డులు, మృతిచెందిన హోంగార్డుల కుటుంబసభ్యులకు నగదు చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధినిర్వహణలో మరణించిన హోంగార్డుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. అనంతరం, ఉద్యోగ విరమణ పొందిన పి.రమణమ్మకు రూ.76,255, షేక్ మస్తాన్‌కు రూ.76,230, వి.చిట్టిబాబుకు రూ. 77,700, సిహెచ్ మునికాంతమ్మకు రూ. 77.775, జి.సత్యనారాయణకు రూ. 79,170, ఎన్. వెంకటశేషయ్యకు రూ. 19,850, టి.విజయలక్ష్మికి రూ.21,315, కె. వెంకటేశ్వరరావుకు రూ. 21,315 వంతున నగదు చెక్కులను పంపిణీ చేశారు. మృతిచెందిన హోంగార్డులు శ్రీనివాసులు, ఎం.వెంకయ్య, జి.వెంకటరమణ, షేక్ అమీర్‌బాషా, సిహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్ వాసుదేవరావు, ఆర్ శ్రీనివాసులు కుటుంబసభ్యులకు కూడా నగదు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ డి.హిమవతి, హోంగార్డ్సు డిఎస్పీ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పొగాకుతో అన్నీ అనర్థాలే



పొగాకును వాడడం అనేకరకాల అనర్థాలకు, అనారోగ్యాలకు దారితీస్తుందని నెల్లూరులోని నారాయణ డెంటల్ కాలేజ్ హెచ్ఓడి కన్నన్ చెప్పారు. నారాయణ డెంటల్ హాస్పిటల్, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్, (పిఎంపి) సంయుక్త ఆధ్వర్యంలో మే 31న నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం' సందర్భంగా కరపత్రాలు విడుదల చేసి, ప్రయాణికులకు పొగాకు వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. కన్నన్ మాట్లాడుతూ ధూమపానం కారణంగా అనేకమంది ప్రమాదకరమైన వ్యాధులకు లోనై మరణిస్తున్నారని, ప్రపంచంలో ప్రతి సంవత్సరం 6 మిలియన్ల మంది దీనివల్ల ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. స్థానిక శ్రీవత్స హాస్పిటల్ గుండెవైద్య నిపుణులు డాక్టర్ కళ్యాణి, ఆర్టీసీ బ్రాంచ్ మేనేజర్ కె.వి.మురళీకృష్ణ, కేంద్ర ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ నాగసాయి సూరి పరవస్తు, పిఎంపి గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, నారాయణ డెంటల్ కాలేజి డీన్ డా. శివకుమార్, డా.అజయ్‌కుమార్, డా.కె.చిరంజీవి, పి.ఎం.పి నాయకులు శాఖవరపు వేణుగోపాల్, జి.శేషయ్య, సి.వీరయ్య, టి.చంద్రశేఖర్, ఆర్టీసి కంట్రోలర్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## వీఎస్‌యులో...

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా మే 31న నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జాతీయ సేవ పథకం (యన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో వీఎస్‌యు ఉపకులపతి ఆచార్య జి.యం సుందరవల్లి సమక్షంలో విద్యార్థులు పొగాకు వాడకానికి, ధూమపానానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. వీఎస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య పి.రామ చంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య జి. విజయ ఆనందకుమార్‌బాబు, కె.సునీత, ఆచార్య సుజా ఎస్ నాయర్, డా సాయిప్రసాద్‌రెడ్డి, డా. ఎం.హనుమా రెడ్డి, డా.శ్రీకన్యారావు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో..

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి జిల్లాశాఖ ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు మే 31న ప్రపంచ పొగాకు నిరోధక దినాన్ని పురస్కరించుకుని స్థానిక రెడ్‌క్రాస్ కాన్సర్ హాస్పిటల్‌లో జరిగిన కార్యక్రమంలో పొగాకు వాడకం వల్ల కలిగే ఇబ్బందులను పలువురు వైద్యులు వివరించారు. డా. నాగేశ్వరరావు, కాన్సర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ చీఫ్ మెడికల్‌ఆఫీసర్ డా.టి.లక్ష్మి, డా.రమేష్, డా.తేజేశ్వర్, డా.జి.ఉష్మశ్రీ, డా.లోకేశ్వరి, జనరల్ మేనేజర్ ఎండి.జుబైర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధికి పెద్దపీట వేస్తున్న శ్రీసిటీ



ఉపాధి అవకాశాలకు, ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు శ్రీసిటీ చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్ నాథ్ ప్రశంసించారు. మే 30న ఆయన శ్రీసిటీని సందర్శించి కొత్తగా ఏర్పాటైన పలు పరిశ్రమలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అంతర్జాతీయస్థాయిలో భారీ పారిశ్రామికవాడ ఏర్పాటుతో పాటు వెనుకబడిన ప్రాంతంలో ఉపాధి అవకాశాల కల్పనకు శ్రీసిటీ యాజమాన్యం తీసుకున్న చొరవను కొనియాడారు. అద్భుతమైన మౌళిక సదుపాయాలు, పెట్టుబడిదారుల అనుకూల వాతావరణం కలిగిన శ్రీసిటీ పారిశ్రామిక హబ్ పురోగతి పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేస్తూ, అందుకు కృషి చేసిన శ్రీసిటీ ఎం.డి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డిని ప్రశంసించారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి డైనమిక్ నాయకత్వంలో రాష్ట్రం పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. నూతన పారిశ్రామిక విధానంతో సమగ్ర సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి సాధన, స్టార్టప్ లను ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధి పెంపు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. కొత్త విధానంలో ప్రాజెక్టుల వేగవంతమైన క్లియరెన్స్‌కు ప్రాధాన్యత ఉంటుందన్నారు. రాష్ట్రంలో అద్భుతమైన లాజిస్టిక్ మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యతా ప్రాతిపదికన పెట్టుబడులు పెడుతోందని తెలిపారు. సిఐఐ సభ్యుల అభిప్రాయాలను తీసుకుని, వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి, సత్యవేడు ఎమ్మెల్యే కె.ఆదిమూలం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కె.సంజీవయ్య, ఏపిఐఐసి వైస్‌ఛైర్మన్ మరియు ఎం.డి, పరిశ్రమల కమిషనర్ ప్రవీణ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు లంకా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా శ్రీసిటీలో నూతనంగా ఏర్పాటైన ఆర్ఎస్‌బి ట్రాన్స్‌మిషన్, అడెలా ఎలక్ట్రికల్స్ పరిశ్రమలను మంత్రి ప్రారంభించారు. దీంతో పాటు ఎన్‌జిసి టిల్ హెల్త్‌కేర్ (విస్తరణ), మాగ్నమ్, ఎవర్‌షైన్ మౌల్డర్స్, బాంబే కోటెడ్ స్పెషల్ స్టీల్స్, బివికె గ్రూప్ అనే ఆరు నూతన కంపెనీల స్థాపనకు మంత్రి సమక్షంలో అవగాహన ఒప్పందాలు జరిగాయి. ఈ కంపెనీల మొత్తం పెట్టుబడి విలువ దాదాపు రూ.500 కోట్లు కాగా, 1500 మందికి ఉపాధి లభిస్తుంది. అనంతరం భారత పరిశ్రమల సమాఖ్య(సిఐఐ) రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి అమర్‌నాథ్ పాల్గొన్నారు. ఇందులో తిరుపతి ప్రాంతానికి చెందిన సిఐఐ సభ్యులు, శ్రీసిటీలోని పలు పరిశ్రమల సిఇఓలు, శ్రీసిటీ పరిసర ప్రాంతాలలోని మరికొందరు పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు. పరస్పర చర్చల ద్వారా పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య మంచి అవగాహన పెంపొందించడం ఈ సమావేశ ఉద్దేశ్యమని సిఐఐ తిరుపతి రీజియన్ ఛైర్‌పర్సన్ శ్రీమతి ప్రియమంజరి టోడి తన ప్రసంగంలో వివరించారు. సమావేశం చివరలో, 'పరిసర గ్రామీణ ప్రాంతాలపై శ్రీసిటీ ఇండస్ట్రియల్ పార్క్ సామాజిక ఆర్థిక ప్రభావం' అనే అంశంపై తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వారి సర్వే నివేదిక, శ్రీసిటీలో 'స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ ఇనిషియేటివ్స్' అనే అంశంపై రూరల్ మీడియా సంస్థల నివేదికలను విడుదల చేశారు.



## పార్లమెంట్ కొత్తభవనం ప్రారంభోత్సవంలో... మన నెల్లూరు ఎంపీలు

మే 28న న్యూ ఢిల్లీలో నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డితో కలసి పాల్గొన్న రాజ్యసభ సభ్యులు, మన నెల్లూరీయులు బీద మస్తాన్‌రావు, విజయసాయిరెడ్డి. పక్కన మిథున్‌రెడ్డి, ఆర్.కృష్ణయ్య తదితర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు నాయకులు.

# జల్‌జీవన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

**- కలెక్టర్ హరినారాయణన్**



జల్ జీవన్ మిషన్ కింద గ్రామాల్లో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్ ఆదేశించారు. ఇటీవల నెల్లూరులోని కలెక్టరేట్‌లో జల్‌జీవన్ మిషన్, సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం, మంచినీటి సరఫరా పనులపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ రంగవరప్రసాద్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకం కింద మంజూరైన 5లక్షల లోపు పనులను త్వరగా మొదలుపెట్టి పూర్తిచేయాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడా కూడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. అవసరమైన చోట వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని అందించాలని, పైపులైన్లు వేసి నీటిని సరఫరా చేసే వీలున్నచోట త్వరితగతిన పైపులైన్లు వేసి నీటిని సరఫరా చేయాలని సూచించారు. గ్రామ సచివాలయాలకు అనుసంధానంగా నిర్మిస్తున్న సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 'అపోలో'లో.. మరో అరుదైన రికార్డు

## ఒకేరోజు విజయవంతంగా 13 మోకాలి శస్త్రచికిత్సలు




నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్ మరో అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. ఆర్థోపెడిక్ సీనియర్ కన్సల్టెంట్ రోబోటిక్ నీ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి ఒకే రోజు 13 మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించి రోగులు త్వరితగతిన కోలుకునేలా చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, మహా నగరాలకే పరిమితమైన ఈ మోకాళ్ళ మార్పిడి రోబోటిక్ సర్జరీని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్లో అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. గతంలో నిర్వహించే మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలో అనేక ఇబ్బందులు ఉండేవని అన్నారు. అయితే రోబోటిక్ మోకాలి మార్పిడి సర్జరీ ద్వారా, కచ్చితత్వంతో పాటు, రోగికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండడం, నొప్పి కోత తక్కువగా ఉండడం, త్వరగా రికవరీ కావడం వంటివి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. శస్త్ర చికిత్స అనంతరం కూడా నొప్పి లేకుండా రోగి తన సాధారణ కార్యకలాపాలను కొనసాగించుకోగలుగుతారని ఆయన తెలిపారు. ఈ రోబోటిక్ సర్జరీని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోబోటిక్ టికెఆర్ తో జీవితాంతం నొప్పి లేని మోకాలి చికిత్స ఉంటుందని, టికెఆర్‌తో సాఫ్ట్ టిష్యూ మేనేజ్ మెంట్, చికిత్స అనంతరం త్వరితగతిన డిశ్చార్జ్ ఉంటుందని, ఇలా అనేక రకాల ఉపయోగాలున్నాయన్నారు. ఈ సమావేశంలో అపోలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, డాక్టర్ వివేకానందరెడ్డి, డాక్టర్ శశిధర్ రెడ్డి, డాక్టర్ షాహల్ తదితరులు పాల్గొన్నారు.

# కోవూరులో జగనన్న కాలనీల పరిశీలన

కోవూరు మండలంలోని పాటూరు, గుమ్మళ్ళదిబ్బ ప్రాంతాల్లో జరుగుతున్న జగనన్న ఇళ్ళ నిర్మాణాల పనులను మే 30న డివిఎల్‌డిఓ వసుమతి ఆకస్మికంగా పరిశీలించి నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయో ఆరాతీశారు. నిర్మాణాల పనులు నాణ్యతగా ఉండాలని సిబ్బందికి చెప్పారు. ఎంపీడీఓ శ్రీహరి, ఏఇ వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'తంగిరాల మహాభారతం' 57వ భాగం




సుభద్రార్జునుల వివాహానికి బలరాముడు అంగీకరించడని, శ్రీ కృష్ణుడు సాగరద్వీపంలో పాశుపత మహోత్సవం జరుగుతుందని చాటింపు వేయించి అందరు యాదవ వీరులతో అక్కడికి ప్రయాణమవుతారు. రహస్యంగా భార్యలతో, దేవకీ వసుదేవులతో, సాత్యకి మొదలగువారితో ద్వారకకు వచ్చి ఇంద్రుడు, శచీదేవి రాగా, మహామునీశ్వరుల సమక్షంలో సుభద్రార్జునుల వివాహం అత్యంత వైభవంగా జరిపించి, వారిద్దరిని ఇంద్రప్రస్థ నగరానికి పంపుతాడు. దారిలో యాదవ రాజులు అర్జునుని చేతిలో ఓడిపోయి వచ్చి బలరామునికి చెప్పగా, యాదవ వీరులు కోపగించి అర్జునుని మీద యుద్ధం ప్రకటిస్తారు. కానీ శ్రీకృష్ణుడు బలరామునికి అర్జునుడు చేసిన దాంట్లో తప్పేమీలేదని, సుభద్రని పెళ్లిచేసుకునే తీసుకెళ్లాడని, అయినా అర్జునుడిని యుద్ధంలో ఓడించటం ఎవరి తరం కాదని నచ్చచెపుతాడు.

సుభద్రార్జునులు ఇంద్రప్రస్థము చేరి అందరి ఆశీర్వాదాలు తీసుకుంటారు. అర్జునుడు కోపంగా ఉన్న ద్రౌపదిని బ్రతిమి లాడుకుని మన్నించమని కోరతాడు. ద్రౌపది, సుభద్రని ఆత్మీయంగా దగ్గరకు తీసుకుని ఆశీర్వదిస్తుంది. తర్వాత యాదవులు కానుకలతో ఇంద్రప్రస్థానికి వెళ్లి సుభద్రని ఆశీర్వదిస్తారు. కొంత కాలానికి సుభద్రార్జునులకు అభిమన్యుడు జన్మిస్తాడు. ద్రౌపదికి కూడా పాండవులతో క్రమక్రమంగా ఐదుగురు కొడుకులు పుడతారు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.



# శ్రీసిటీలో అలరించిన 'గజేంద్రమోక్షం'



శ్రీసిటీలోని ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక 'శ్రీవాణి' ఆధ్వర్యంలో స్థానిక శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద పండిత కవి ఒంటి రవి నిర్వహించిన గజేంద్ర మోక్షం కథా ప్రవచన కార్యక్రమం అందరినీ అలరించింది. భాగవతంలోని ఓ అద్భుత ఘట్టం గజేంద్ర మోక్షం అన్నది అందరికీ తెలిసిందే. ఈ కథలో, అహంకరించిన ఒక ఏనుగు, చివరకు సర్వం కోల్పోయి ఆ దేవదేవుడైన శ్రీమన్నారాయణునిని శరణు కోరి శరణాగతిని పొంది ఎలా శ్రీహరి భక్తునిగా మారిందో ఆయన వివరించారు. బాధల్లో ఉన్నవారు భక్తిశ్రద్ధలతో భగవంతుని స్మరిస్తే తప్పక ఫలితం దక్కుతుందన్నది దీని సారాంశంగా ఆయన తన ప్రవచనంలో తెలిపారు. కథా ప్రవచనం ప్రారంభానికి ముందు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లవారిపాలెం వెస్ట్ గ్రామానికి చెందిన మహిళా భక్తుల బృందం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం ఆలపించారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో శ్రీసిటీ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు చురుగ్గా పాల్గొనడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. శ్రీసిటీ ప్రతినిధులు మధురెడ్డి, పి.బాలాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీసిటీ ఉద్యోగులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## నల్లగొండ్ల దేవాలయంలో
# మెట్టుకూరు పూజలు

వింజమూరు మండలం నల్లగొండ్లలో ప్రసిద్ధమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో మే 30న ఉదయగిరి నియోజకవర్గ వైకాపా పరిశీలకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి పూజలు చేశారు. ఆలయ అర్చకులు పరాంకుశం సత్యనారాయణచార్యులు స్వాగతం పలికారు. నాయకులు అంకిన పల్లి ఓబులురెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## విశ్వనాథరావుపేట
# సచివాలయం తనిఖీ

బోగోలు మండలంలోని విశ్వనాథ రావుపేట బిట్-1 సచివాలయాన్ని మే 30న ఎంపీడీఓ సిహెచ్ శ్రీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో జరిగే స్పందన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులు పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలిచ్చారు.

# జ్వాలాముఖి అమ్మవారికి.. పట్టు వస్త్రాలు



గ్రామస్థులు సామూహికంగా జరుపుకునే పండుగల్లో పాల్గొనడం మనసుకు ఎంతో ఆనందాన్నిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ఆయన ఆ తోటపల్లి గూడూరు మండలం వరిగొండ జ్వాలాముఖి అమ్మవారి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మంత్రిని ఆలయ మర్యాదతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కాకాణి, జ్వాలాముఖి అమ్మవారికి సంప్రదాయ పద్దతిలో పూజలు చేసి, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి విలేకర్లతో మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా వైభవంగా నిర్వహిస్తున్నట్టుగా, ఈ సంవత్సరం కూడా పాలక మండలి ఛైర్మన్ రవీంద్రయ్య, సభ్యులు, స్థానిక ప్రజలు అందరూ కలసికట్టుగా జ్వాలాముఖి అమ్మవారి వార్షికోత్సవాలను నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. ఈ ప్రాంతంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ, భక్తుల కొంగుబంగారమైన జ్వాలాముకి అమ్మవారి ఆశీస్సులు ప్రజలకు మెండుగా ఉండాలని ఆశిస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రజలు, భక్తులు కోరుకున్న విధంగా ఈ ఆలయాన్ని అన్ని వసతులతో మరింత మెరుగ్గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు. జ్వాలాముఖి అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి నిండుగా ఉండాలని, ప్రజలందరికీ అమ్మవారి దీవెనలు పుష్కలంగా ఉండాలని కోరుకుంటున్నానన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



# సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ మేరిగ

గూడూరు మండలం విందూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఇటీవల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పాలనా పరంగా మరింత చేరువయ్యేలా దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కొత్త చరిత్రకు నాంది పలికారని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా సుదూర ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లవలసిన అవసరం లేకుండా గ్రామస్థాయిలో తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా కూడా సచివాలయ వ్యవస్థను రూపొందించారని మురళి తెలియజేశారు. ఎమ్మెల్యే వరప్రసాద్, జడ్పీటీసీ యామినిరెడ్డి, ఎంపీపీ, వైసిపి నాయకులు మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎద్దల నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక పథకాలను అమలు చేయాలి




భవన నిర్మాణ కార్మిక సంఘం, సిఐటియు అనుబంధ సంస్థ 8వ మహాసభ గత నెల 30వ తేదీ గూడూరులోని షాదీ మంజిల్‌లో గండికోట మధు అధ్యక్షతన జరిగింది. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.అల్లయ్య, ఎన్.శ్రీనివాసులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డులోని 12వందల కోట్ల రూపాయలు నిధులలో గత ప్రభుత్వం 450 కోట్లను దారి మళ్లించగా, ఈ ప్రభుత్వం ఏకంగా 750 కోట్ల రూపాయలను సంక్షేమ పథకాలకు మళ్లించడమే కాకుండా, తమకు అందాల్సిన అనేక పథకాలను నిలిపివేయడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నిక జరుగగా, ఎస్.డి రఫీ అధ్యక్షులుగా, సేలం శేఖరాచారి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. పుట్టా శంకరయ్య, జోగి శివకుమార్, బి.వెంకటరమణయ్య, గోపీనాథ్, యస్.ముత్యాలయ్య, శివయ్య, మస్తాన్, కిష్టయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



గూడూరులోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు మే 30వ తేదీ వైభవంగా ప్రారంభమయ్యాయి. అంకురార్పణము, పుణ్యాహవచనం, ఋత్విగ్వరణం, దీపారాధనం, మృత్సంగ్రహణం,వాస్తు హోమం, ధ్వజపట ప్రతిష్ఠతో మొదలైన ఈ బ్రహ్మోత్సవాలు... జూన్ 9వ తేదీ లక్షతులసి పూజ, శ్రీ పుష్పయాగోత్సవం, ద్వాదశా రాధనం, ఏకాంతసేవ మహాపుష్పయాగంతో ముగుస్తాయని ఆలయ పాలక మండలి ఛైర్మెన్ శ్రీకంటి రామ్మోహన్‌రావు పత్రికా విలేకర్ల సమావేశంలో తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు. సమావేశంలో ఆలయ ఇ.ఓ నవీన్‌కుమార్, సభ్యులు అన్నం రఘురామయ్య, పాదర్తి సుప్రజ, కృష్ణయ్య, వాదస్పతి, సురేంద్ర, పాదర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కోటలో ఆర్డీవో, డిఎస్పీ సుడిగాలి పర్యటన



కోటలో జరిగే అభివృద్ధిపనులు పరిశీలించెందుకు గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్, గూడూరు డిఎస్పీ సూర్య నారాయణరెడ్డిలు ఇటీవల ఆకస్మిక పర్యటన చేశారు. ముందుగా కోట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శిధిలావస్థలో ఉన్న రెండు తరగతి గదులను, బిసి బాలికల హాస్టల్, మహిళ మండలి భవనాలను పరిశీలించారు. అక్కడ నుండి పాత హాస్పిటల్, పాత మండల పరిషత్ స్థలాలు, పోలీసు క్వార్టర్స్ స్థలాలు, సచివాలయం భవనాలు, దాదా రాయి గుంట స్థలాలు పరిశీలించారు. అక్కడనుండి గాంధీ బొమ్మ సెంటర్ వద్ద జరుగుతున్న అభివృద్ధిపనులు పరిశీలించి పాత పోలీస్‌స్టేషన్ మరియు పోలీస్ క్వార్టర్స్ స్థలాలు పరిశీలించారు. ఆ తరువాత కొత్త చెరువు వద్ద సర్కిల్‌ను పరిశీలించి అక్కడ నుండి గూడూరుకు వెళ్లిపోయారు. వాకాడు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హరికృష్ణ, తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ భవాని, కోట ఎస్సై పుల్లారావు, అధికారులు పాల్గొన్నారు.



# విద్యాసామాగ్రి పరిశీలన

విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థులకు అవసరమైన విద్యాసామాగ్రి 'జగనన్న విద్యా కానుక' ద్వారా అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చేరిన జగనన్న విద్యా కానుక విద్యాసామాగ్రిని ఇటీవల ఆర్డీవో కిరణ్‌కుమార్ విద్యాశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు - నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరచడంతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి సాధించిందని పేర్కొన్నారు. డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ శివప్రకాష్‌రెడ్డి, ఎంఇవో దేవకుమార్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రావూఫ్ తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ దివ్యాంగుల భరోసా



గూడూరు పట్టణంలోని డివిఆర్ కమ్యూనిటీ హాల్ నందు ఇటీవల రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో 'దివ్యాంగుల రోటరీ భరోసా' కార్యక్రమం జరిగింది. నెల్‌కాస్ట్ లిమిటెడ్ కంపెనీ వారి దాతృత్వంతో ఈ కార్యక్రమం జరుగగా, రోటరీ క్లబ్ ప్రతినిధులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నెల్‌కాస్ట్ ప్రతినిధి వెంకటేష్ మాట్లాడుతూ తమ కంపెనీ ద్వారా ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని, అదే క్రమంలో ఇప్పుడు రోటరీ వెస్ట్ క్లబ్ ద్వారా దివ్యాంగులకు పలసరుకులు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని, రాబోయే రోజుల్లో కూడా రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ వారికి తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్‌యాదవ్, ఎన్ ఎస్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, వాసుగౌడ్, సుబ్రహ్మణ్యం, సిద్ధారెడ్డి, శ్రీను, కృష్ణంరాజు, బలరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా.. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు

## త్వరలో సీఎంచే ప్రారంభోత్సవం - రాష్ట్ర పరిశ్రమల మంత్రి అమర్‌నాథ్ వెల్లడి

బోగోలు మండల పరిధిలోని రూ.300 కోట్లతో చేపట్టిన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు 95శాతం మేర పూర్తయ్యాయని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. మే 29న బోగోలు మండలంలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణ, అధికారులతో కలిసి మంత్రి గుడివాడ అమర్నాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ రికార్డు సమయంలో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులను చేపట్టామని, ఇప్పటికే 95శాతం మేర పనులు పూర్తి కాగా, మౌలిక వసతులకు సంబంధించి మరో 5 శాతం పనులు మాత్రమే పూర్తి చేయాల్సి ఉందని, ఈ పనులను కూడా త్వరలో పూర్తిచేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ హార్బర్ ఏర్పాటుతో సుమారు ఆరువేల మంది మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, అన్ని విధాల ఈ ప్రాంత



రూపు రేఖలు పూర్తిగా మారిపోతాయన్నారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, కావలి ఆర్డిఓ శీనా నాయక్, ఏపీ మారిటైం బోర్డు చీఫ్ ఇంజనీర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## 48 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


ఇటీవల పదోతరగతి పరీక్షల్లో 550కి పైగా మార్కులు సాధించిన 48 మంది విద్యార్థులకు డాక్టర్ వెంకటేశ్వరరావు, సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మే 28న ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. నెల్లూరులోని ఐఎంఏ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలో అత్యధికంగా 593 మార్కులు సాధించిన గోకులకృష్ణారెడ్డికి 7వేలు, 587 మార్కులు సాధించిన మానసకు రూ.6వేలు, 580 మార్కులు తెచ్చుకున్న అక్షత్, పద్మరాజ్‌లకు రూ.5వేల వంతున నగదును, జ్ఞాపికలను బహుకరించారు. 44 మంది విద్యార్థులకు రూ.4వేల వంతున ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. అత్యధిక మార్కులు సాధించిన ఆ ముగ్గురు విద్యార్థులకు రూ.2వేల చొప్పున ఉపాధ్యాయురాలు నాగవరమ్మ బహుకరించారు. నగర మేయర్ స్రవంతి, కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, డెప్యూటి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, రాజగోపాల్, వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు విజయప్రకాష్, తిరుమలరాజు, అరవింద్, శివరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

## కమనీయం.. శ్రీనివాస కల్యాణం



నెల్లూరు వెంగళరావునగర్‌లోని శ్రీ వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి దేవాలయంలో మే27న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శ్రీనివాస కల్యాణం కన్నులపండువగా జరిగింది. తొలుత ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారికి-అమ్మవార్లకు వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా పుష్పయాగం నిర్వహించి, అనంతరం నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రముఖ వేదపండితుడు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఈ వేడుకలను నయనానందకరంగా చేపట్టారు. ఈ వేడుకలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించి పులకించిపోయారు. గోవింద నామస్మరణలతో కల్యాణ వేదిక ప్రాంగణం మార్మోగింది. ఆలయ కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

## మధురకవి మోచర్ల జయంతి



జిల్లాకు చెందిన మధుర కవి మోచర్ల రామకృష్ణయ్య 119వ జయంతి మే 27న నెల్లూరులో జరిగింది. స్థానిక టౌన్‌హాలు రీడింగ్‌రూంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కవులు పాల్గొని మోచర్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవితా రంగంలో మోచర్లది ప్రత్యేక స్థానమని, ఆయన రచనలు వర్ధమాన కవులకు మార్గదర్శకాలని కొనియాడారు. నెరసం (నెల్లూరుజిల్లా రచయితల సంఘం) అధ్యక్షుడు జయప్రకాష్, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

## ముగిసిన.. 2వ విడత ఉపాధ్యాయ శిక్షణ



నెల్లూరులో రెండవ విడత జిల్లా స్థాయి ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం ఇటీవల విజయవంతంగా ముగిసింది. ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్ (కోర్సు కో-ఆర్డినేటర్) ఆధ్వర్యంలో నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న ఆర్ఎస్ఆర్ పురపాలక ఉన్నత పాఠశాలలో రెండవ విడతగా 5 రోజుల జిల్లా స్థాయి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల (సెకండరీ గ్రేడ్ టీచర్ల) ఇండక్షన్ శిక్షణా కార్యక్రమం 'కోర్సు సంచాలకులు'గా నెల్లూరుజిల్లా డిఇఓ ఆర్.యస్.గంగాభవాని వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మరియు ఏపి ఎస్‌సిఇఆర్‌టి సంయుక్తంగా ఈ ట్రైనింగ్ తరగతులను ఏర్పాటు చేశారు. ఈ శిక్షణా కార్యక్రమం 2 విడతలుగా జరిగింది, మొదటి విడత ఈనెల 15 నుండి 19 వరకు మరియు రెండవవిడత మే22 నుండి 26వ తేది వరకు నిర్వహించారు. ఈ శిక్షణకు 1998, 2008 డిఎస్‌సి(యమ్.టి.యస్), 2018 డి.యస్.సిలో ఎస్‌జిటిలుగా నియామకమైన ఉపాధ్యాయులు సుమారు 290 మంది హాజరయ్యారు. ఈ శిక్షణ నాన్-రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించబడిందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇవే తేదీలలో గవర్నమెంట్ డైట్‌ల ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరిగిందని డా.పి.రమేష్ తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠశాలల పునఃప్రారంభం అనంతరం శిక్షణాంశాలను బోధనలో అన్వయించి సత్ఫలితాలను సాధించాలని ఆయన కోరారు. సీనియర్ డైట్ అధ్యాపకులు డాక్టర్ ఆర్.బాలాజీరావు, డైట్ ఉపన్యాసకులు యస్.బోయదాస్, కె.విజయచంద్ర, ఆర్ఎస్ఆర్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు ఎస్.మధుసూదన్‌బాబు, డి.ఆర్.పిలు తదితరులు పాల్గొన్నారు.

## హరినారాయణరెడ్డికి.. గౌరవ డాక్టరేట్




ఇచ్ఛా ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు మరియు ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల తమిళనాడు రాష్ట్రం హోసూరులో సమాజ సేవకులకు గౌరవ డాక్టరేట్ ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరు నగరానికి చెందిన డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డికి గత 40 సంవత్సరాలుగా ఆయన చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి డాక్టరేట్ బహుకరించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె.ఎ.మనోకరన్, సినీ దర్శకులు, రచయిత డాక్టర్ గుణవంత మంజు, సినీ నటులు డాక్టర్ కృష్ణమూర్తి, లయన్ డాక్టర్ ఆకుల రమేష్, డాక్టర్ రవిచంద్రన్, రచయిత కె.మురళీమోహన్ రాజు, నాట్యమయూరి మంజుల, లయన్ డాక్టర్ ఎస్.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ బాలుకు..స్వర సంకీర్తనం

గానగంధర్వుడు, భారతీయ సినిమా గాయకుడు..నెల్లూరు ముద్దుబిడ్డ..పద్మశ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని జూన్ 11వ తేది సాయంత్రం 5.30 గంటలకు నెల్లూరు పురమందిరంలో స్వరసంకీర్తనం కార్యక్రమం నిర్వహిస్తామని, నెల్లూరులోని రాగం-తానం-పల్లవి స్వరసంగీత కళాసంస్థ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బాలు బాలమిత్రులకు ఆత్మీయసత్కారం ఉంటుందని, 'బాల గంధర్వ చిత్ర గీత స్వరాభిషేకం' పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.

## టూకీగా...



### మనుబోలు వీరభద్రస్వామికి.. శఠారి బహుకరణ

మండల కేంద్రమైన మనుబోలులో కొలువైవున్న భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామికి చీమకుర్తి సుబ్బమ్మ జ్ఞాపకార్థం ఆమె మనుమలు గాదంశెట్టి గంగాధర్, లక్ష్మి మే 28న శఠారిని బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాసులు స్వామివారికి పంచామృతాభిషేకం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించి శఠారిని స్వామికి సమర్పించారు.

### ఇస్లాంపేట దర్గాలో గంధమహోత్సవం

నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ఇస్లాంపేటలో కొలువైవున్న హజరత్ మస్తాని అమ్మవారి దర్గాలో మే 27న గంధ మహోత్సవం వేడుకగా జరిగింది. మతపెద్దలు పూలచాందినీలతో గంధాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

### పొట్టేపాళెంలో సిపిఎం శిక్షణా తరగతులు

నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాళెం గ్రామంలో మే 27న సిపిఎం నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆ పార్టీ శిక్షణా తరగతులు నిర్వహించారు. కేంద్రప్రభుత్వ విధానాలు అస్తవ్యస్తంగా ఉన్నాయంటూ నిరసన వ్యక్తం చేశారు. నాయకులు ఆలూరు తిరుపాలు, పూడిపర్తి జనార్దన్, ముత్యాల నాగయ్య, జానా లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### వవ్వేరులో ఉచిత వైద్యశిబిరం

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరులో వైస్‌ఛైర్‌పర్సన్ కె.లలిత ఆధ్వర్యంలో కిమ్స్ ఆసుపత్రి వైద్యసిబ్బంది ఇటీవల ఉచిత వైద్యశిబిరం నిర్వహించి పేదరోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. బుచ్చి సిఐ రామారావు, కిమ్స్ మార్కెటింగ్ మేనేజర్ అనిల్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీదేవి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### పెంచలకోనలో నిత్యాన్నదానానికి విరాళం

జిల్లాలో ప్రసిద్ధిచెందిన పెంచలకోన శ్రీ లక్ష్మీనృసింహ దేవాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి వైఎస్సార్‌జిల్లా బద్వేలుకు చెందిన ఊరుబిండి పెద్దనరసింహారెడ్డి-వెంకట రత్నమ్మ దంపతులు లక్షా నూటపదహారు రూపాయలను ఇటీవల విరాళంగా సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామయ్యస్వామి చేతులమీదుగా ఆ మెత్తాన్ని ఆలయ ఉద్యోగి పెంచలరెడ్డికి అందజేసినట్లు ఇఓ జనార్ధన్‌రెడ్డి తెలియజేశారు.

### కోటలో ఐసిడిఎస్ సమావేశం

మండలకేంద్రమైన కోట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో మే 30న సెక్టార్ సమావేశం జరిగింది. సిడిపిఓ మునికుమారి పాల్గొని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు, గర్భిణులకు సకాలంలో పౌష్టికాహారం పంపిణీ చేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని సిబ్బందికి సూచించారు. సూపర్‌వైజర్లు సుమతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### గుండెమడకలలో.. పిడుగుపాటుకు గేదె మృతి

వింజమూరు మండలంలోని గుండెమడకల గ్రామంలో మే 30న ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. గ్రామంలోని వై.రమణారెడ్డి ఇంటి పశువుల కొట్టంలో కట్టేసివున్న గేదెపై హఠాత్తుగా పిడుగుపడి గేదె కన్నుమూసింది. 85వేల విలువచేసే గేదె చనిపోవడంతో తనకు జీవనం కష్టమవుతుందని ఆయన ఆవేదన చెందాడు.

### గండిపాళెం పిహెచ్‌సికి పరికరాల వితరణ

ఉదయగిరి మండలం గండిపాళెం ప్రాథమిక వైద్యశాలకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.వెంకటప్రసాద్ సహకారంతో మే 30న సుమారు 5 లక్షల విలువైన వైద్యపరికరాలను వితరణగా అందజేశారు. వైద్యాధికారులు డాక్టర్ శివకల్పన, డాక్టర్ వినీత పాల్గొన్నారు.

### కావలిలో ఆధార్ స్పెషల్ డ్రైవ్

కావలిలో మే 30న ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆధార్‌కార్డులు లేని ఐదేళ్లలోపు పిల్లలకు వారి తల్లితండ్రుల ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్‌ల ఆధారంగా ఆధార్‌కార్డులు ఇచ్చారు. ఐసిడిఎస్ అధికారి టి.శారద ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

# కల్యాణ వైభవం...!



నెల్లూరులోని శ్రీ లక్ష్మీ కన్‌స్ట్రక్షన్స్ అధినేత, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ డొంకల చెంచు నరసింహ రావు - జ్యోతిల కుమారుడు చైతన్య - చికిత శ్రీ (పాలేటి ఉమాశంకరరావు - సింధూర ల కుమార్తె)ల పెళ్లి మే 31వ తేదీ తెనాలిలోని చావాస్ గ్రాండ్‌లో జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.



పెద్దచెరుకూరు వాస్తవ్యులు గొరినేని శ్రీనివాసులు నాయుడు - విజయలక్ష్మిల కుమారుడు నితిన్ - శ్రీవర్షిణి (నెల్లూరు వాస్తవ్యులు మావిళ్ళపల్లి రవికుమార్ - అరుణజ్యోతిల కుమార్తె)ల పరిణయం మే 26వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.



గూడూరు వాస్తవ్యులు, మాజీ వైసీపీ కౌన్సిలర్ నాశిన నాగులు - శారదల కుమారుడు హరీష్‌కుమార్ - వెంకటసంధ్య (కావలి మండలం, అల్లిగుంటపాలెం గ్రామ వాస్తవ్యులు తుక్కూరు సుధాకర్ - వెంకటసుబ్బమ్మల కుమార్తె)ల వివాహం మే 26వ తేదీ గూడూరులోని దివ్య ఫంక్షన్‌హాలులో జరిగింది. నవ దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

# పేదలకు మంచి చేయాలన్నదే.. సిఎం సంకల్పం

**- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



పేదలకు మంచి చేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని ఏపి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, వెంకటగిరి నియోజకవర్గం వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మే 30న ఆయన దక్కిలిలోని ఎంపిడిఓ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తూ, పాలనను ప్రజల చెంతకు చేర్చారని, సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలకు మేలుచేసేందుకు నిరంతరం కృషిచేస్తున్నారని కొనియాడారు. అనంతరం, దక్కిలి మండలంలో పనిచేస్తున్న సచివాలయ వలంటీర్లకు శాలువాలు కప్పి, సన్మానించారు. సంక్షేమపథకాలను ప్రజలకు చేరువచేయడంలో వలంటీర్లు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

## మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించిన రామ్

సైదాపురం మండలంలోని సైదాపురం గ్రామంలో మే 31న మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని, మరియు బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని నేదురురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం సైదాపురంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొని వలంటీర్లను సన్మానించారు.

# ఉచితాలలో మేటి.. ఒకరికొకరు పోటీ.. ఎవరికి వారే సాటి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న ఆర్థిక వ్యవస్థ కొనవూపిరితోనైనా కొట్టుకలాడుతోంది. కేంద్రం చేయి వదిలేసిన మరుక్షణమే అది కుప్పకూలడం ఖాయం. దీనికి కారణం మితిమీరిన అప్పులు. అలవికాని సంక్షేమ పథకాలు.

ఇలాంటి తరుణంలో టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రాన్ని బాగుచేసే సంస్కరణలు ప్రకటించాల్సింది పోయి, అదనపు ఉచిత పంపక పథకాలు ప్రకటించడం పతాక స్థాయికి చేరిన ఆయన పదవీ కాంక్షకి నిదర్శనం.

## ఆదాయం రూ.13,190 కోట్లు...

## అప్పు రూ. 7,916 కోట్లు

గత ఆర్థిక సంవత్సరంలో ఖజానాకు సగటున నెలకు రూ.13,190 కోట్ల ఆదాయం వచ్చింది. నెలకి ప్రభుత్వం చేసిన అప్పు రూ.7,916 కోట్లు. వైసీపీ సంక్షేమ పథకాలు, కొన్ని అత్యవసర బిల్లుల చెల్లింపు కలుపుకుంటే నెల గడవడానికి ఏపీకి కనీసం రూ. 21,106కోట్లు అవసరం. ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకు నెలకు రూ. 6,000కోట్లు, సామాజిక పెన్షన్లు నెలకు రూ.1800 కోట్లు, అప్పుల రీపేమెంట్లు రూ.4,500 కోట్లు.. ఇవి తప్పనిసరి ఖర్చులు. ఏదైనా నెలలో జీతాలు, పెన్షన్లు ఆలస్యమైనా అప్పుల రీపేమెంట్‌ను మాత్రం ఆర్‌బీఐ సరిగ్గా ఆ సమయానికి రాష్ట్ర ఖజానా నుంచి కట్ చేసుకుంటుంది. ఈ ఖర్చుల విలువ రూ.12,300 కోట్లు. అంటే ఆదాయంలో మిగిలింది ఇంకా రూ.890 కోట్లు మాత్రమే. ప్రతి నెలా ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ, ఆసుపత్రుల్లో మందుల బిల్లుల చెల్లింపు, మరికొన్ని అత్యవసర చెల్లింపు బిల్లులుంటాయి. వీటికి మిగిలిన రూ.890 కోట్లు ఏ మాత్రం సరిపోవు. అందుకే ప్రభుత్వం అప్పు తీసుకొస్తోంది. వీటితో పాటు వైసీపీ ప్రభుత్వం నవరత్నాలను కూడా అప్పులతోనే అమలు చేస్తోంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ భూములు, కార్యాలయాలు, భవనాలు, కాలేజీలు, పార్కులు, పోర్టు భూములు, ఆర్ అండ్ బి భవనాలు, స్థలాలు, మద్యం అమ్మకంపై వచ్చే ఆదాయం అన్నీ తాకట్టు పెట్టి మరీ ప్రభుత్వం అప్పు తెచ్చింది.

## నేతల ఉచితాల బాట..

## బాబు నోటకూడా అదే మాట!

ప్రస్తుత అధికార పార్టీ విధానాలను ఘాటుగా టీడీపీ విమర్శిస్తోంది. ఇప్పుడు ఆ పార్టీ కూడా ఇదే రకమైన డబ్బు పంచుడు పథకాల హామీలు గుప్పించడం చూస్తుంటే, రాష్ట్ర సంక్షేమం కన్నా సీఎం పదవిపైనే చంద్రబాబుకి ఎక్కువ ఆసక్తి ఉందని స్పష్టమైపోతోంది. వైసీపీ ప్రభుత్వమే మళ్ళీ అధికారంలోకి వచ్చినా, లేక టీడీపీ అధికార పగ్గాలు చేపట్టినా ఖజానా ఆదాయం పెంచే ఆలోచన చేయాలి. అలా కాకుండా ఈ సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే అప్పులపై ఆధారపడాల్సిందే. ఎవరు అధికారంలోకి వచ్చినా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అవసరమైన సంస్కరణలు చేపడితే, వాటి ఫలితాలు రావాలంటే కనీసం ఏడాదిన్నర పడుతుంది.

## ఆర్థిక కష్టాలని కళ్ళకి కడుతున్న టీడీపీ ఉచిత హామీలు..!

మహానాడు సందర్భంగా టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోలో ఏ హామీకి ఎంత ఖర్చవుతుందో గమనిస్తే కళ్ళు బైర్లు కమ్మాల్సిందే. ..! ప్రధానంగా మహిళలు, రైతులు, నిరుద్యోగులే లక్ష్యంగా చంద్రబాబు పథకాలు ప్రకటించారు. నిరుద్యోగ భృతి కింద 10 లక్షల మంది నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3000 చెల్లించాలంటే నెలకు రూ.300 కోట్లు అంటే ఏడాదికి 3600 కోట్లు కావాలి. ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ అమలు చేయాలంటే ఒక్కో సిలిండర్‌కి కనీస ధర రూ. 850 చొప్పున లెక్క కట్టినా ఒక్కో కుటుంబానికి సగటున ఏడాదికి 2,500 రూపాయలు అదనంగా కావాలి. కేవలం ఒక్క తెల్లరేషన్ కార్డు వున్నవారికి మాత్రమే ఈ పథకం వర్తింప చేస్తామంటున్నారు. అలా చేసినా రాష్ట్రంలో కోటికిపైగా తెల్ల రేషన్ కార్డులున్నాయి. తెల్లరేషన్ కార్డులను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నా ఏడాదికి 2500 కోట్లు పై మాటే. 18 నుంచి 59 ఏళ్ళ మధ్య మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ. 18,000 ఇస్తారు. ఏపీలో ఈ ఏజ్ గ్రూప్‌లో ఉన్న మహిళలు కోటికిపైగా ఉన్నారు. కోటి మందిని పరిగణనలోకి తీసుకుని లెక్కిస్తే ఏడాదికి ఈ ఖర్చు రూ. 18,000 కోట్లు అవుతుంది. అంటే నెలకి 1500 కోట్లు ఖర్చవుతుంది.

జిల్లా పరిధిలో ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం కొత్త ఆలోచన. ఈ స్కీమ్ వల్ల ప్రభుత్వ జేబు నుండి కొత్తగా ఖర్చు పెట్టేదేమీ ఉండదు. కాకపోతే ఆర్టీసీకి వచ్చే ఆదాయానికి గండి పడుతుంది. అది ఎంతా..? అన్నది పథకం అమలై ప్రయాణాలు మొదలైతే కానీ తేలదు.

ప్రతి రైతుకు ఏడాదికి రూ.20,000 చొప్పున సాయం అందిస్తామన్నారు. రాష్ట్రంలో రైతులు 80 లక్షల వరకు ఉన్నారు. దీని ప్రకారం లెక్కిస్తే ఏడాదికి ఖర్చు రూ. 16000 కోట్లు.

ఈ ఐదు హామీలకి కలిపి నెలకు సుమారు రూ. 5,800 కోట్లు కావాలి. గత ఏడాది వైసీపీ ప్రభుత్వం నెలకి రూ.7,916 కోట్ల అప్పు చేసింది. దీనికి అదనంగా ఇంకో రూ.5,800 కోట్ల అప్పు చేయాల్సి ఉంటుంది. ఇదింకా మినీ మేనిఫెస్టోనే అంటున్నారు. తుది మేనిఫెస్టోలో ఇంకెన్ని ఉచితాలుంటాయో వేచి చూడాలి.

## పెట్టుబడుల కోసమైతే అప్పు మంచిదే!

అప్పుగా తెచ్చిన డబ్బును ఖచ్చితంగా క్యాపిటల్ వ్యయం కోసం అంటే ఆ డబ్బును పెట్టుబడిగా మళ్లించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించి ఆదాయాన్ని సంపాదించాలి. వచ్చిన ఆదాయంతో ఆ అప్పు, వడ్డీలు కట్టేస్తే ఆ సంపద లేదా ఆస్తి రాష్ట్రానికి మిగులుతుంది. కానీ, ఆంధ్రాలో అలా జరగడం లేదు. అప్పు తెచ్చి అందులో 83.4 శాతాన్ని తిరిగి అప్పు చెల్లించడానికే వాడుతున్నారు. కాగ్ నివేదిక ప్రకారం 2019-20లో ప్రభుత్వం తెచ్చిన మొత్తం అప్పులో 71.71 శాతాన్ని పాత అప్పుల అసలు, వడ్డీ కింద చెల్లించింది. 2020-21లో తెచ్చిన మొత్తం అప్పులో 77.12 శాతాన్ని పాత అప్పుల అసలు, వడ్డీల రూపంలో చెల్లించింది. 2021-22 నాటికి ఈ పాత అప్పుల అసలు, వడ్డీల చెల్లింపు తెచ్చిన మొత్తం అప్పుల్లో 83.4 శాతానికి చేరింది. 2022-23 సంవత్సరంలో ఈ శాతం 90శాతం దాటొచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే అప్పులు, వడ్డీల చెల్లింపుల రాష్ట్రానికి పెనుప్రమాదంగా మారాయి.

రాష్ట్రం ఇలాంటి ఆర్థిక సుడిగుండంలో చిక్కుకోవడానికి బటన్ నొక్కుడు పథకాలే కారణమని తెలిసి కూడా టీడీపీ అధినేత మళ్ళీ పంపకాల పరంపరనే కొనసాగిస్తానని ప్రకటించడం దారుణమైన విషయం. అధికార పార్టీ విస్మరించిన అభివృద్ధి కార్యకలాపాలు, పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడులకు ఆహ్వానం, మౌలిక సదుపాయాల రూపకల్పన, రాజధాని ఏర్పాటు, రోడ్ల నిర్మాణం, పోలవరం సహా ఇతర ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు ఎలా పూర్తిచేస్తారు వంటి అంశాలపైన క్లారిటీ ఇవ్వకపోవడం అర్థరహితం. తామే అధికారంలోకి వస్తామని చెప్తున్న టీడీపీ కూడా ఇవన్నీ చేయదని అర్థం చేసుకోవాలా? అన్నట్లుగా సామాన్యుడు తల పట్టుకునేలా మహానాడు తీర్మానాలు ఉన్నాయి. పార్టీ ఏదైనా, నేతలు ఎవరైనా ఉచితాలలో వారికి వారే పోటీ పడుతూ, ఎవరికి వారే మేటి అనిపించుకుంటూ తమకెవరూ సాటి లేరన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు. వారి పోకడ ఇలాగే కొనసాగితే నవ్యంధ్రప్రదేశ్ కాస్తా సూన్యాంధ్రప్రదేశ్‌గా మారక తప్పదని ఆర్థిక నిపుణులు అంటున్నారు...!

# ఫ్రెండ్స్ వాకర్స్...'శతమానం భవతి'



నెల్లూరు ఏసి స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 28న 'శతమానం భవతి' కార్యక్రమం నిర్వహించి, మే నెలలో జన్మించిన వాకర్స్ సభ్యులకు సన్మానాలు చేసి, వారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కార్జోన్ అధినేత శంతన్‌కృష్ణ సహకారంతో 700 మజ్జిగ ప్యాకెట్లను వాకర్స్‌కు, క్రీడాకారులకు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు తలపనేని హరిబాబునాయుడు, కార్యదర్శి బిరదవోలు రామమోహన్‌రెడ్డి, కోశాధికారి షేక్ నజీర్ అహమ్మద్, వాకర్స్ ఇంటర్నేషనల్ -2022 కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు, నాపూరు శ్రీనివాసమూర్తి, షేక్ అబ్దుల్‌ఖాదర్, జివి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రూ.16వేల కోట్లతో.. మరో నాలుగు పోర్టులు

రాష్ట్రంలో రూ. 16వేల కోట్లతో మరో నాలుగు పోర్టుల నిర్మాణ పనులను ప్రభుత్వం చేపట్టిందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ఇటీవల ఆయన గుడ్లూరు మండల పరిధిలోని రామాయపట్నం పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర వ్యవసాయమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి 2019లో అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో 974 కిలోమీటర్ల సువిశాల సముద్ర తీర ప్రాంతంలో సహజ వనరులను సద్వినియోగం అయ్యేందుకు ఏపీ మారిటైం బోర్డు ను ఏర్పాటుచేశారన్నారు. రాష్ట్రంలో ఇప్పటికి 6 పోర్టులు ఉండగా, కొత్తగా కాకినాడ, రామాయపట్నం, శ్రీకాకుళం జిల్లా మూలపేట, మచిలీపట్నం జిల్లా బందరు పోర్టుల ఏర్పాటుకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. రామాయపట్నం పోర్టు ఏర్పాటుకు గత ఏడాది ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని, రూ. 2600 కోట్లతో పనులు శరవేగంగా జరుగుతున్నాయని, 2024 జనవరి లోగా రామాయపట్నం పోర్టు మొదటి దశ నిర్మాణ పనులను పూర్తిచేసేందుకు కృషి జరుగుతోందన్నారు. ఈ పోర్టు ఏర్పాటుతో ఈ ప్రాంతం ముఖచిత్రం మారబోతోందని, వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, రామాయపట్నం పోర్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎం.డి ప్రతాప్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, ఏపీ మారిటైం బోర్డు చీఫ్ ఇంజనీర్ రాజగోపాల్, గుడ్లూరు, ఉలవపాడు మండలాల తహశీల్దార్లు సూర్యనారాయణసింగ్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

# పోలేరమ్మకు పొంగళ్ళు

బోగోలు పంచాయతీలోని చెంచులక్ష్మీపురం గ్రామంలో కొలువైఉన్న శ్రీ పోలేరమ్మ అమ్మవారికి మే 30న గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా పూజలుచేసి మొక్కులు తీర్చుకున్నారు. గుడి వద్ద పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించుకున్నారు.

# లోటా పోయింది.. కోటానే మిగులుతుందా!?



'ఈసీ' అంటే ఎన్నికల సంఘం. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా. దేశం మొత్తానికి ఒకటే ఉంటుంది. అదే, అమెరికాలో అయితే చీప. రాష్ట్రానికి ఓ ఎన్నికల సంఘం ఉంటుంది. ఒక రాష్ట్రంలోని ఎన్నికల సంఘం పెత్తనం... దాని పక్క రాష్ట్రంలో చెల్లదు.

మరి, ఇండియా... ప్రపంచంలోనే అత్యధిక జనాభా గలిగిన దేశం కదా! ఢిల్లీలో కూర్చుని, దేశం మొత్తం మీద కర్ర పెత్తనం చేయాలని అనుకున్నవారికి... రాష్ట్రానికో ఎన్నికల సంఘం ఉంటే కుదరదు. అందుకని, మనకు ఒకటే ఎన్నికల సంఘం. 'ఎన్నికల సంఘం' ద్వారా దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ చేయడం కేంద్రంలో అధికారంలో ఉన్నవారికి చాలా సులభమవుతుంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆ ఎన్నికల సంఘంతో ఏమి చెప్పిస్తే... అదే ఫైనల్.

బీజేపీకి తలనొప్పిగా తయారైన జనసేన విషయంలో ఎన్నికల సంఘం ఇప్పుడు తీసుకున్న నిర్ణయం... జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విషయంలో ఎలా పరిణమించబోతున్నదో అర్థం కావడం లేదు.

ఆయనను చేయి పట్టుకుని అసెంబ్లీ సభా మందిరంలోకి అయితే ఎన్నికల సంఘం నడిపిస్తుందని విశ్లేషిస్తున్నారు గానీ, జనసేనకు మాత్రం ఒక పార్టీగా చరమగీతం పాడుతుందని అంటున్నారు.

గత రెండు ఎన్నికల్లో పవన్ కళ్యాణ్.... అసెంబ్లీ వైపు కన్నెత్తి చూసే భాగ్యానికి నోచుకోలేదు.

జనసేనను పవన్ కళ్యాణ్ 2014 ఎన్నికలకు ముందు నెలకొల్పారు. నిజానికి, ఎన్నికల్లో పోటీ చేయడం కోసమే మన దేశంలో ఎవరైనా రాజకీయ పార్టీలు నెలకొల్పుతారు. కానీ, పవన్ మాత్రం ఆ ఎన్నికల్లో జనసేనను పోటీకి దూరంగా ఉంచారు. అందువల్ల 2014-2019 మధ్య అసెంబ్లీ మొహం జనసేన చూడలేదు.

2019 ఎన్నికలు వచ్చేసరికి పోటీ చేశారు గానీ, ఆ పార్టీ తరఫున రాజోలు నుంచి రాపాక వరప్రసాద్ తప్ప మరొకరు అసెంబ్లీ మొహం చూడలేదు. ఆయన కూడా జనసేనకు టాటా ఛీరియో చెప్పేశారు.

ఆ విధంగా చూస్తే, జనసేనకు 2019-2023 మధ్య కూడా అసెంబ్లీలో ఎవరూ లేనట్టే లెక్క.

పవన్ పార్టీ పెట్టి, పదేళ్లు కావస్తోంది. అయినా, ఆ పార్టీ తరఫున అసెంబ్లీలో చేయెత్తే సభ్యుడు ఒక్కరు అంటే ఒక్కరూ ఇప్పటివరకూ లేకుండాపోయారు.

నిజానికి తెలుగులో పవన్ అంతటి మాస్ ఫాలోయింగ్ కలిగిన నటుడు మరొకరు లేకపోయినా, రాజకీయంగా మాత్రం సొంతంగా ఒక్క సీటూ గెలవలేని పరిస్థితులపై... ఇన్నాళ్ళు ఆయన ఆలోచించలేదు. ఇన్నాళ్లకు ఆయనకు... ఇప్పుడు... చక్కని అవగాహన కలిగింది.

తనను చూడగానే ఈలలు, చప్పట్లు, అరుపులు, కేకలు, కేరింతలతో... సీ.ఎం, సీ.ఎం అంటూ ఊగిపోయేవారే తప్ప, ఓట్లు వేసి గెలిపించేవారు వీళ్ళు కాదనే సత్యం, తత్వం బోధపడింది.

తనతో సహా, జనసేనలోని ముఖ్యులు అందరూ అసెంబ్లీకి ఈసారి రావడానికి దారేది అని ఆయన కొంతకాలంగా నిరావేశంగా ఆలోచిస్తున్నారు. 'గాజు గ్లాసు'లోకి తొంగి చూస్తూ పవన్ కళ్యాణ్ లెక్కలు వేస్తున్నారు.

సరిగ్గా ఇక్కడే, ఎన్నికల సంఘం రంగంలోకి దిగింది. పైకి కనపడకుండానే, పవన్ కళ్యాణ్‌కు తాను చేయగలిగిన 'సాయం' చేసింది. ఆయన దగ్గర నుంచి 'గాజు గ్లాసు'ను లాగేసుకుంది.

కొంతకాలంగా పవన్ కళ్యాణ్, ప్రాక్టికల్‌గా ఆలోచిస్తున్న విషయం తెలిసిందే. ఆ ఆలోచనలో భాగంగా, తెలుగుదేశంతో పొత్తు పెట్టుకోవాలని ఆయన గట్టిగా అభిలషిస్తున్నారు. ఆ ఆలోచనతోనే, వైసీపీ వ్యతిరేక ఓటును చీలనివ్వను అనే నినాదాన్ని తలకెత్తుకున్నారు. తెలుగుదేశంతో పొత్తు అనే రంగుల పుస్తకానికి వేసిన అందమైన ఓ అట్ట... ఈ నినాదం.

రాష్ట్ర బీజేపీని కూడా కలుపుకు వెళ్లాలని పవన్ గట్టిగా ప్రయత్నిస్తున్నారు కానీ, కుదరడం లేదు.

సరే, ఆ సంగతి తరవాత చూడొచ్చు గానీ, టీడీపీతో పొత్తువల్ల ఎన్ని స్థానాల్లో పోటీచేసే అవకాశం జనసేనకు లభిస్తుంది అనే విషయంలో జనసేనలో ఎవరికీ స్పష్టత ఉన్న సూచనలు కనిపించడం లేదు.

'పొత్తు అనేది గౌరవప్రదంగా ఉండాలి. అయిదూ.. పదీ సీట్లు అంటే ఒప్పుకోం' లాంటి మాటలు కూడా పవన్ కళ్యాణ్ 'సీ.ఎం, సీ.ఎం..' అరుపులు, కేకల మధ్య అప్పుడప్పుడూ మాట్లాడుతున్నారు.

పొత్తుల మీద పవన్ కళ్యాణ్ ఎన్ని రకాలుగా, ఎన్నిసార్లు మాట్లాడుతున్నా కూడా తెలుగుదేశం చప్పుడు చేయడం లేదు. ఔను అనడం లేదు. కాదు అనడం లేదు. ఎప్పుడు ఏమి మాట్లాడాలో చంద్రబాబుకు తెలుసు మరి.






అయినప్పటికీ, ఈ రెండు పార్టీలు కలిసే ఎన్నికలకు వెళతాయనే ఒక అభిప్రాయం మాత్రం జనంలోకి గట్టిగా వెళ్లిపోయింది(లేకపోతే వైసీపీ నాయకులు ఊరుకునేటట్లు లేరు మరి).

ఈ రెండు పార్టీల వారు ఒక చేతితో సైకిల్ 'హేండిల్' పట్టుకుని, మరోచేతితో 'గాజు గ్లాసు' పట్టుకుని ఎన్నికలకు వెళదామని అనుకుంటూ ఉండి ఉంటారు.

అయితే, భారత ఎన్నికల సంఘం వారు, పవన్ చేతిలోని గాజు గ్లాసును లాగేసుకోవడంతో, ఇప్పుడు జనసేనకు ఎన్నికల గుర్తు లేకుండా పోయింది.

అంటే...!?

- జనసేనకు అత్యంత జనాకర్షణ కలిగిన నేత ఉన్నారు.
- ఆయన వెనుక ఓ పెద్ద... కాపు కులంలో... అత్యధిక భాగం ఉంది.
- వైసీపీని క్షేత్రస్థాయిలో సవాలు చేస్తున్న తెలుగుదేశంపార్టీ మద్దతు జనసేనకు ఉంది.
- తెలుగులో అతి పెద్ద సినీహీరో ఆశీస్సులు పరోక్షంగా ఉన్నాయి.
- ఏడో, ఎనిమిదో, తొమ్మిదో ఓట్ల శాతం జనసేనకు ఉందనే భావనకు జనంలో లోటు లేదు.

కానీ, ఎన్నికల చిహ్నం లేదు. ఇప్పటి దాకా, గాజు గ్లాసు - జనసేన అనేవి... ఆ పార్టీ కార్యకర్తల దృష్టిలో భక్త కవలలు. ఇప్పుడు కాదు.

జనసేనను అసలు ఒక రాజకీయపార్టీగానే ఎన్నికల సంఘం ఇప్పుడు గుర్తించడం లేదు. అందుకని కామన్ సింబల్‌ను జనసేనకు ఇవ్వడం లేదు.

అందువల్ల, పవన్ కళ్యాణ్‌తో సహా... జనసేన ముఖ్యులు ఒకే ఎన్నికల చిహ్నంపై పోటీచేసే పరిస్థితులు ఈ ఎన్నికలకు కనిపించడం లేదు. తలా ఒక గుర్తుపై పోటీచేస్తే... గెలిచిన వారిని స్వతంత్ర అభ్యర్థులుగానే పరిగణిస్తారు తప్ప, జనసేన సభ్యులుగా కాదు. అప్పుడు, జనసేన అభ్యర్థే గెలిచినప్పటికీ స్వతంత్ర అభ్యర్థి అవుతున్నందున, ఆ అభ్యర్థిపై పవన్ కళ్యాణ్‌కు అయిదు పైసల అదుపు కూడా ఉండదు. అయితే, పవన్ పార్టీకి మార్గం లేకపోలేదు.

జనసేన అభ్యర్థులు కూడా తెలుగు దేశం పార్టీ ఎన్నికల చిహ్నంపై పోటీ చేయవచ్చు, పవన్ కళ్యాణ్‌తో సహా. అసెంబ్లీ వరకు, వీరందరూ తెలుగుదేశం సభ్యులే అవుతారు. ఈ ఏర్పాటుతో పవన్ కళ్యాణ్ లక్ష్యం చాలావరకు నెరవేరే అవకాశాలు ఉంటాయి. వైసీపీని బలంగా ఢీ కొనడానికి టీడీపీ, జనసేనకు అవకాశం ఉంటుంది.

చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఒకే చిహ్నంపై, ఒకే పార్టీ అభ్యర్థులుగా, ఒకే వేదికపై నుంచి మాట్లాడాల్సి ఉంటుంది. ఓటర్ల మైండ్‌పై ఇటువంటి ఈక్వేషన్ పెద్ద ప్రభావం చూపెడుతుంది. 'చెట్టు మీద కాయను... సముద్రంలో ఉప్పును కలిపినట్టే.... టీడీపీని, జనసేనను ఎన్నికల సంఘం కలిపిందా అనేది చూడాలి.

ఇటువంటి సమీకరణం రూపుదిద్దుకుంటే....

- కాలక్రమంలో 2029 నాటికి జనసేన అనేది ఉండదు.
- 'పవన్ సీ.ఎం, పవన్ సీ.ఎం' అనే అరుపులు, కేకలకు ఇక అవకాశం ఉండదు.
- జనసేన, పవన్ కళ్యాణ్ బలం.. టీడీపీని మరింత బలోపేతం చేయడానికే ఉపయోగపడుతుంది.
- అలా అని చెప్పి, బీజేపీ చిహ్నంపై జనసేన పోటీ చేయలేదు. చేస్తే, ఒక్క సీటూ గెలవలేదు. అప్పుడు అసెంబ్లీలో అడుగుపెట్టాలనే పవన్ లక్ష్యం, చిరకాల స్వప్నం నెరవేరదు. వైసీపీ చిహ్నంపై జనసేన పోటీ చేయలేదు. పోటీయే దానితో కనుక.

కనుక, ఒకే సింబల్‌పై పోటీ చేయవలసిన అనివార్య పరిస్థితులలో పవన్ జనసేన పడిపోతే.. వారికి ఉన్న ప్రత్యామ్నాయం సైకిలే. అందులో సందేహం లేదు. 'సైకిల్' గుర్తు మీదే పోటీ చేయాల్సి వస్తే, అంతకు మించిన ఆత్మహత్యా సదృశం జనసేనకు మరొకటి ఉండకపోవచ్చు.

అయినప్పటికీ, తెలుగుదేశం తప్ప ప్రత్యామ్నాయం మరొకటి పవన్ కళ్యాణ్‌కు లేదనే భావమే పలువురు విశ్లేషకులలో వ్యక్తం అవుతోంది.

అది కూడా సజావుగా జరుగుతున్న సూచనలు కలగడం లేదు. ఇందుకు రెండు కారణాలు కనిపిస్తున్నాయి.

1. పవన్ కళ్యాణ్ రాజకీయ నాయకుడు కాకపోవడం. ఆయనకు ఉన్న తిక్కకు లెక్క సరిగా సెట్ అవ్వకపోవడం.
2. జనసేన రాజకీయ పార్టీ కాకపోవడం. దానికి 'లెక్క'లు సరిగా సెట్ అవ్వకపోవడం.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

# అంచనాలను మించి శ్రీసిటీ అభివృద్ధి

## రాష్ట్రానికి తలమానికం... నిరుద్యోగ యువతకు వరం

### - డెప్యూటీ సిఎం నారాయణస్వామి ప్రశంస



శ్రీసిటీ అంచనాలకు మించి అభివృద్ధి సాధిస్తుండడంతో అభినందనీయమని, శ్రీసిటీ రాష్ట్రానికే తలమానికంగా ఉండడం, నిరుద్యోగ యువతకు ఒక వరంగా వర్ధిల్లుతుండడం సంతోషకరమని డెప్యూటి సిఎం నారాయణస్వామి కొనియాడారు. శ్రీసిటీని ఆయన ఇటీవల సందర్శించి శ్రీసిటీ ప్రగతిని చూసి ఆశ్చర్యపోయారు. గతంలో సరైన ఉపాధి లేక వెనుకబడ్డ ప్రాంతం, ఒక్క పరిశ్రమ లేని సత్యవేడు ప్రాంతంలో శ్రీసిటీ వస్తే అనేక పరిశ్రమలు వస్తాయని, తద్వారా నియోజకవర్గ ప్రజలకు స్థిరమైన ఉపాధి దక్కుతుందని అప్పట్లో ఆశించాను. ఇప్పుడు శ్రీసిటీ అభివృద్ధి నా అంచనాలను అధిగమించింది'.. అంటూ ఆయన సంతోషపడ్డారు. ఒక్క సత్యవేడు నియోజకవర్గమే కాదు, చిత్తూరు, నెల్లూరు జిల్లాలను దాటి రాష్ట్రం మొత్తానికి నిరుద్యోగ యువతకు శ్రీసిటీ దిక్సూచిగా మారిందంటూ అభినందించారు. రెండువందలకు పైగా పరిశ్రమలు, వేలాదిమందికి ఉద్యోగాలు, చక్కని వాతావరణం కలిగిన శ్రీసిటీ పురోగతి పట్ల నారాయణస్వామి హర్షం వ్యక్తం చేస్తూ, దివంగతనేత వైఎస్ రాజశేఖరరెడ్డి దూరదృష్టి, దార్శనికతకు ఇది చక్కటి ఉదాహరణ అని అన్నారు. శ్రీసిటీ ప్రభావంతో ఇక్కడ ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఎంతగానో మెరుగయ్యాయని, ఇంత పెద్ద ప్రాజెక్ట్ ఏర్పాటు వెనుక శ్రీసిటీ యాజమాన్యం, ప్రత్యేకించి రవీంద్ర సన్నారెడ్డి కృషిని ఆయన మెచ్చుకున్నారు. ఈ సందర్శనలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు నారాయణస్వామి, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా రైతులకు..ప్రభుత్వం 'భరోసా'

జిల్లాలో ఈ ఏడాది 2,14,636 మంది రైతులకు తొలివిడత రైతు భరోసా – పిఎం కిసాన్ నగదు రూ.118 కోట్లు, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాలకు పంట నష్టపోయిన 1579 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నగదు రూ. 1.85 కోట్లు నేరుగా రైతుల ఖాతాలకు జూన్ 1న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. ఆ నిధులను కర్నూలు జిల్లా పత్తికొండ నుంచి ముఖ్యమంత్రి విడుదల చేయగా, నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌రెడ్డి, తదితరు అధికారులు పాల్గొన్నారు.

# సింహపురి ఎక్స్‌ప్రెస్.. వేళలు మార్చండి

## రైల్వే మంత్రికి ఎంపీ ఆదాల వినతి



గూడూరు – సికింద్రాబాద్ మధ్య ప్రయాణించే సింహపురి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణపు వేళలో మార్చాలని... ముఖ్యంగా తిరుగు ప్రయాణంలో దాదాపు గంటపాటు సమయాన్ని తగ్గించాలని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి న్యూఢిల్లీలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలసి విన్నవించారు. దక్షిణ మధ్య రైల్వే ద్వారా సింహపురి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12709) గూడూరులో ప్రతిరోజు సాయంత్రం 6–40కి బయలుదేరి, 643 కిలోమీటర్ల దూరం ప్రయాణించి సికింద్రాబాద్‌కు ఉదయం 5–30 గంటలకు చేరుకుంటుందని, అది ప్రయాణీకులకు ఎంతో సౌకర్యంగా ఉందని ఆయన తన వినతిపత్రంలో పేర్కొన్నారు. అదే రైలు (12710) రాత్రి సికింద్రాబాద్‌లో 10–50కి బయల్దేరి జిల్లా కేంద్రమైన నెల్లూరుకు ఉదయం 8–18 గంటలకు చేరుతోందని, గూడూరుకు 9–20కి చేరుకుంటోందని, అయితే కొన్ని కారణాల వల్ల ఇది ప్రతిరోజు అరగంట నుంచి గంట పాటు ఆలస్యంగా నడుస్తుండడంతో, ప్రయాణికుల సమయం వృధా అవుతోందని, ప్రయాణీకుల రోజువారీ కార్యక్రమాలకు అంతరాయం కలుగుతోందని ఆయన వివరించారు.

ఈ విషయమై స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి అనేక ఫిర్యాదులు, వినతులు అందాయని, అందువల్ల ప్రజా సౌకర్యార్థం సికింద్రాబాద్లో బయలుదేరే సమయాన్ని రాత్రి 10–55 గంటలకు బదులుగా 10–00 గంటలకు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదాల విజ్ఞప్తి చేశారు. తద్వారా అందరికీ సౌకర్యం కలుగుతుందని కోరారు. అందుకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని ఎంపీ ఆదాలకు హామీ ఇచ్చారు.

REMEMBERING OUR FOUNDER



Shri. Nalagatla Krishna Reddy Garu
10 Nov 1935 – 2 June 2022

NAGARJUNA
GROUP OF RESTAURANTS
SINCE 1984

*Today, He May Not be in Our Midst Physically, But He has Left Behind an Incredible Impression on the Many Lives that He has Touched. His Story will be Told in the Years to Come to Inspire Many More Generations about Our Great Patriarch. And His Food Legacy will be Carried On, With the Same Passion that He Passed On.*

HE LOVED HEARTILY, GAVE GENEROUSLY & LIVED FEARLESSLY.
AND AS HE WOULD ALWAYS SAY,
"I AM HERE, DON'T FEAR!"

Fondly Remembered By
Family & Friends

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com